


ఉష్ణోగ్రత (అంచనా)

31-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	38	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	29
చీరాల	37	28



- మధ్యాహ్న భోజనంలో మార్పులు
- సంక్షేమ హాస్టళ్లలోనూ పంపిణీకి ఏర్పాట్లు
- పౌరసరఫరాల శాఖకు ఇండెంట్ పంపిన విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదివేల ఎంటీల సేకరణ
- బియ్యం పక్కదారి పట్టకుండా నేరుగా కళాశాలలు, పాఠశాలలకే పంపిణీ

సన్నబియ్యంతో భోజనం

గుంటూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి): దొడ్డ బియ్యంతో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు ఇంతకాలం అల్లాడి పోయారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నా.. చాలామంది ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ పరిశీలనలో సన్నబియ్యంతో అయితే భోజనం చేస్తామని విద్యార్థులు చెప్పారు. దీంతో రానున్న విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఇక నుంచి (మిగతా 4వ పేజీలో)



జల్‌జీవన్..జాగు

- గ్రామీణులకు అందని స్వచ్ఛజలం
- అట్టడుగున పల్నాడు, బాపట్ల జిల్లాలు
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- గడువుదాటి ఏడాదైనా అరకొరగానే పనులు
- మూడు జిల్లాల్లో 54 గ్రామాల్లోనే నూరుశాతం కుళాయిలు

2024 మార్చి కల్లా ప్రతీఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. గ్రామాల్లోని తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి నూరుశాతం ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాలి.. అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో ఆరేళ్లుగా జాప్యం జరుగుతోంది. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరుగారి పోయింది. ఇప్పటికీ పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించలేదంటే పనులపై అధికారుల్లో ఏపాటి శ్రద్ధ కనిపిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





గండిగనుమల గ్రామంలో నీటి కోసం పాట్లు

కుళాయిలు ఇలా..

జిల్లా	మొత్తం గృహాలు	కుళాయిలున్నవి	లేనివి	శాతం
పల్నాడు	4,34,399	1,54,243	2,80,156	35.51
గుంటూరు	2,33,883	1,58,407	75,476	67.73
బాపట్ల	3,64,788	1,48,980	2,16,808	40.67
మొత్తం	10,33,070	4,61,630	5,72,440	44.68

44.68 శాతమే పూర్తి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,33,070 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 4,61,630 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే 44.68 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇంకా 5,72,440 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 54 గ్రామాల్లో మాత్రమే నూరుశాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వగలిగారు. తాగునీటి పథకాలు, చెరువుల అభివృద్ధి, పైపులైన్ల పునరుద్ధరణ, కుళాయి కనెక్షన్లు పనులు ఆరేళ్లుగా అరకొరగానే సాగుతున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల్లో అశ్రద్ధ.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇంటింటికి రక్షిత నీటిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో జల్‌జీవన్ మిషన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఆరేళ్లు అవుతున్నా ఇప్పటికీ సగం ఇళ్లకు కూడా కుళాయిల కనెక్షన్లు ఇవ్వలేదు. ఉన్న తాగునీటి పథకాలను, చెరువులను అభివృద్ధి చేయలేదు. జలజీవన్ మిషన్ కింద తాగు నీటి పథకాల అభివృద్ధి నత్తనడకన సాగుతోంది. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే అట్టడుగున నిలిచాయి. ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.1021.38 కోట్ల అంచనాతో పనులు చేపట్టినా గతంలో, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాల కారణంగా పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో పనులు (మిగతా 4వ పేజీలో)



డీలర్లకు సూచనలు చేస్తున్న మంత్రి మనోహర్

పారదర్శకంగా రేషన్ పంపిణీ

- రేపటి నుంచి దుకాణాల్లోనే సరుకులు
- పండుగ వాతావరణంలో పంపిణీకి ఏర్పాట్లు
- తెనాలిలో చౌకదుకాణాల పరిశీలనలో మంత్రి నాదెండ్ల

తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పండుగ వాతావరణంలో పారదర్శకంగా ఆదివారం నుంచి దుకాణాల వద్దే రేషన్ సరుకులు పంపిణీ జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ పంపిణీకి సంబంధించి తెనాలిలోని దుకాణాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం మంత్రి మనోహర్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. డీలర్ పాయింట్ వద్ద ధరల పట్టిక, స్టాక్ నిల్వల డిస్ప్లే, ఈపాస్ యంత్రం పనితీరు, డిజిటల్ వెయింగ్ మిషన్లను ఆయన పరిశీలించారు. ఈ పాస్ యంత్రం ద్వారా తూకంలో తేడాలు, స్లిప్ రంగు మార్పు వంటివి గుర్తించి ఓ డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుకుల పంపిణీలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ అంటూ ప్రకటించి విఫలమైందన్నారు. ఎండీయూ వాహనం ద్వారా సరుకుల పంపిణీ విధానం ప్రజలకు మంచి జరగకపోగా జీవనోపాధి దెబ్బతినేలా ఉండటంతో రద్దు చేశామన్నారు. ఇందులో ఏ విధమైన కక్షసాధింపుచర్యలో మరోకటో లేదన్నారు. కేవలం లబ్ధిదారులకు మంచి కోసమే డీలర్ల ద్వారా పంపిణీకి రంగం సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి ఒక్క లబ్ధిదారు దుకాణానికి వచ్చి సరుకులు తీసుకోవాలన్నారు. రేషన్ దుకాణాల వద్ద మంచినీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించినట్లు తెలిపారు. డీలర్ల నుంచి సమస్యలు వస్తే దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డుల్లోని అధికారుల నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మంత్రి వెంట సబ్‌కలెక్టర్ సంజనసింహ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అధికారులు పాల్గొన్నారు.


డీసీఎంఎస్ ఛైర్మన్‌గా వడ్రాణం హరిబాబు



- అధికారిక ఉత్తర్వులు విడుదల

4

ఇద్దరికి కరోనా





- తెనాలి, ఉండవల్లిలో కేసుల గుర్తింపు
- జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ, ఐసోలేషన్ వార్డు
- సమృద్ధిగా ప్రాణవాయువు నిల్వలు సిద్ధం

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తెనాలి, ఉండవల్లిలో ఇద్దరికి కరోనా సోకినట్లు గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు వైద్యశాలల్లో కొవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీ సమీపంలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. రోగుల నుంచి నేసల్ స్వాబ్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ర్యాపిడ్ కిట్ పరీక్షలు, ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నారు. కరోనా పాజిటివ్ కేసులు నమోదైతే, రోగుల చికిత్సల కోసం బీ క్లాస్ వార్డులో 15 పడకలతో ఐసోలేషన్ వార్డును కూడా ఏర్పాటు చేశారు. వార్డులో వెంటిలేటర్లతో పాటు ఆక్సిజన్ కాన్‌సంట్రేటర్లను సిద్ధం చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 30 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు జీజీహెచ్‌లో సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు చేరినా ప్రాణవాయువు అందించేందుకు సిద్ధమని జీజీహెచ్ (మిగతా 4వ పేజీలో)

నేడే పింఛన్లు

- ఒకరోజు ముందు పంపిణీకి ఏర్పాట్లు
- మూడు జిల్లాలకు రూ.321.89 కోట్లు విడుదల
- ఎంపికైన వితంతువులకు 12న స్పౌజ్ కోటాలో..

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి):: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ ఈసారి ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందనుంది. జూన్ 1 ఆదివారం. దీంతో శనివారం మే 31న పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నెలలోనే రూ.వెయ్యి పెంచి రూ.4 వేల చొప్పున పింఛను ఇస్తుంది. పైగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ, ఆ రోజు సెలవు అయితే ముందు రోజే సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛను అందజేసింది. కిందటేడాది సెప్టెంబరు, డిసెంబరు నెలల్లో ఒకటో తేదీ ఆదివారం, జనవరి 1 సెలవు కావడంతో ముందురోజే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ క్రమంలో ఈ నెలలోనూ ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ చేయనున్నారు. గుంటూరు జిల్లాలో 2,51,280 మంది పింఛనుదారులకు సంబంధించి రూ.109.02 కోట్లు, పల్నాడు జిల్లాలో 2,70,234 మందికి రూ.117.87 కోట్లు, బాపట్ల జిల్లాలో 2,25,787 మందికి రూ.95 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నగదును ఇప్పటికే సచివాలయ సిబ్బంది డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామునే లబ్ధిదారులను స్వయంగా కలిసి ఇవ్వనున్నారు.

వితంతవులకు కొత్తగా..

పింఛన్ పొందుతూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో భర్త మరణిస్తే వారి భార్యకు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్పౌజ్ కోటాలో దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేసి వారికి పింఛను అందజేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కోటాలో గుంటూరు జిల్లాలో 2,565, పల్నాడు జిల్లాలో 3,094, బాపట్ల జిల్లాలో 2715 మందికి పింఛను అర్హత లభించింది. వీరికి ఈ నెల 12న పింఛను అందించనున్నారు. గత ఏడాది పింఛనును రూ.1000 పెంచి ప్రారంభించిన రోజు కావడంతో కొత్తగా పింఛను పొందిన వారికి కూడా ఆ రోజు నుంచి ఇవ్వాని ప్రభుత్వం నిర్ణయించింది.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

- గుంటూరు, తెనాలిలో పొంగిన డ్రెయిన్లు

గుంటూరు, తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, తెనాలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రాత్రి వరకు పడిన వర్షంతో రోడ్లపై పెద్దఎత్తున నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. గుంటూరు నగర పరిధి, శివార్లలోని కాలనీలు ముంపునకు గురయ్యాయి. తెనాలిలోని గంగానమ్మపేట గంగానమ్మ తల్లి దేవస్థానంరోడ్డు, కొత్తపేటలోని సబ్‌రిజిస్టార్ రోడ్డు, బోసురోడ్డులోని చిట్టాంజనేయస్వామి ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి.



గుంటూరులో ఇలా..



జలమయమైన తెనాలి చిట్టాంజనేయ స్వామి రోడ్డు



ఎన్టీఆర్ స్టేడియం ఎదురు యోగా రోడ్డులో మేయర్, కమిషనర్

4న గుంటూరులో యోగాంధ్ర

- నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- విజయవంతం చేయాలన్న మేయర్ కోవెలమూడి

గుంటూరు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 4వ తేదీన స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఎదురు యోగా రోడ్డులో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుని బుధవారం జరిగే మెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. ఇప్పటికే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలపై సచివాలయ కార్యదర్శుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో పెరిగిన గుర్రపు డెక్క



అతిథులు వెళ్లిపోతున్నారు..!

- ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనం
- ఆలనా పాలనా చూసే వారు కరువు
- గుర్రపు డెక్కతో నిండిపోయిన చెరువు
- నీరు లేక విడిది మార్చుకుంటున్న వలస పక్షులు
- కన్జర్వేషన్ రిజర్వుగా గుర్తింపుతోనే సరి..
- వాచ్‌మన్‌కు పది నెలలుగా జీతం ఇవ్వని దుస్థితి

6

ఏఎన్‌యూలో యోగాంధ్ర భారీ ర్యాలీ



ర్యాలీలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

పెదకాకాని, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూలో శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. వర్సిటీలోని ప్రధాన ప్రాంతాలు, మెయి న్ గేటు వద్ద నినాదాలు చేశారు. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, యూజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ప్రొఫెసర్ పాల్ కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.సిద్ధయ్య, ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి, వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, రత్తయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా వద్రాణం హరిబాబు

గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వద్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల చైర్మన్‌లను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ ఎ.భార్గవ్‌తేజ వ్యవహరించారు. నూతన చైర్మన్ హరిబాబు జూన్ మొదటి వారంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

మణిపాల్‌లో బోన్ బ్రిడ్జ్ ఇంప్లాంటేషన్ విజయవంతం

తాడేపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో ఏపీలోనే తొలిసారిగా బోన్ బ్రిడ్జ్ ఇంప్లాంటేషన్ విజయవంతంగా జరిగిందని డాక్టర్ సందీప్, శ్రీధర్, షహిదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోటియా అనే చెవుల లోపంతో పుట్టిన చిన్నారికి వినికిడి కల్పించారని పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సను కన్సల్టెంట్ ఈఎన్‌టీ, హెడ్ అండ్ నెక్ సర్జరీ అండ్ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ వీవీకే సందీప్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ షహిదా సంయుక్తంగా విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. సదరు చిన్నారి జన్మతహ రెండు చెవులలోనూ తీవ్రమైన కనెక్టివ్ హియరింగ్ లాస్‌తో మణిపాల్‌కు వచ్చిందని పేర్కొన్నారు. ఇయర్ కెనాల్ సరిగ్గా లేకపోవడంతో సాంప్రదాయ హియరింగ్ ఎయిడ్స్ ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా బోన్ కండక్షన్ పరిష్కారాలపై అవగాహన పెరిగే అవకాశం ఉందని డాక్టర్ సందీప్ తెలిపారు.

ఉన్నది 48 గంటలే..!

- 3న ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం
- మిగిలింది శని, సోమవారం, ఆదివారం సెలవు
- కొన్ని శాఖల్లో విడుదల కాని మార్గదర్శకాలు

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై సడలించిన నిషేధం మరో మూడు రోజుల్లో అమలులోకి రానుంది. అందులో ఒక రోజు ఆదివారం సెలవుదినం తీసేస్తే మిగిలేది కేవలం 48 గంటలు మాత్రమే. అయినప్పటికీ ఇంకా కొన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదు. కొన్నింటిలో అయితే కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయలేదు. అలానే మూడు, నాలుగు శాఖలకు అయితే ఇప్పటి వరకు బదిలీల మార్గదర్శకాలే విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో జూన్ 3వ తేదీ నుంచి అమలులోకి రానున్న నిషేధానికి మరికొన్ని రోజుల పాటు సడలింపు ఇవ్వాలని ఆయా శాఖల్లోని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు.

ఈ సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఈ నెల 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు ప్రభుత్వం సడలించింది. సెలవు దినాలు పోను 15 పని దినాలను కేటాయించి బదిలీల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేసింది. ఆ మేరకు విద్య, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల్లో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియని పూర్తి చేశారు. రెవెన్యూ, సర్వేలో ఇంకా కొనసాగుతోంది. ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లు, పంచాయతీరాజ్‌లోనూ ఇదే పరిస్థితి. వాణిజ్య పన్నుల శాఖలో అయితే బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలే జారీ కాలేదు. కొన్ని శాఖల్లో అయితే కౌన్సెలింగ్‌లు నిర్వహించకుండా ప్రజాప్రతినిధుల లేఖల సిఫార్సుల మేరకు బదిలీలు చేసేందుకు ప్రక్రియని పూర్తి చేశారు.

బదిలీ ఉత్తర్వులు ముందుగానే ఇస్తే ఉద్యోగులు ఎవరైనా కోర్టులో పిటిషన్లు వేస్తారన్న భయంతో చాలా శాఖల్లో అధికారులు ఆర్డర్స్ బయటకు విడుదల చేయలేదు. పాత తేదీతో జూన్ 3న విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. కాగా బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉందని, దీనిని మరో వారం నుంచి పది రోజుల పాటు పొడిగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర సంఘాల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాలను కూడా సమర్పించారు. అయితే ఈ వారం అంతా సీఎంతో సహా మంత్రులు పర్యటనల్లో ఉండటం వల్ల అమరావతి రాజధానిలో అందుబాటులో లేరు. సోమవారం విధులకు హాజరయ్యే అవకాశం ఉండటంతో పొడిగింపుపై నిర్ణయం ఆ రోజున తీసుకొనే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు.

రౌడీషీటర్లకు తగిన గుణపాఠం

బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోటి యాదవ్

తెనాలి అర్బన్, పెదకాకాని మే 30 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో రౌడీషీటర్లకు పోలీసులు తగిన గుణపాఠం చెప్పారని, కుల సంఘాలు వారిని వెనకేసుకుని రావడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి యువజన విభాగం అధ్యక్షుడు పి.కోటి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని తగిన విధంగా దండించకపోతే మరింత పెచ్చరిల్లుతారన్నారు. తప్పు చేయాలంటే భయపడాలనే ఉద్దేశంతోనే పోలీసులు అలా ప్రవర్తించారే కానీ, మరొకటి కాద న్నారు. ప్రాణహాని ఉందని పోలీసులకు బీసీ అయిన కానిస్టేబుల్ చిరంజీవి ఫిర్యాదు చేస్తేనే పోలీసులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కానిస్టేబుల్ భార్య ఎస్సీ అయినప్పటికీ వారికి న్యాయం చేయకుండా రౌడీషీటర్ల పక్షాన కుల సంఘాలు మాట్లాడటం సరి కాదని హితవు పలికారు. నిజంగా దళితులకు అన్యాయం జరిగితే తమ సంఘం కూడా పోరాడుతుందని రౌడీషీటర్లకు హంత కులకు మద్దతుగా నిలిస్తే కుల సంఘాల ఐక్యతకు విలువ లేకుండా పోతుంద న్నారు. గంజాయి కేసులో రౌడీ షీటర్లు నవీన్ కుమార్, జాన్ విక్టర్, రాకేష్‌ను అరెస్టు చేశారనే అక్కసుతో కానిస్టేబుల్ చిరంజీవిపైన వారు దాడి చేశారని గుర్తుచేశారు. కానిస్టేబుల్ భార్య ఒక ఎస్సీ అని, తల్లిదండ్రులు లేని అనాథ అనే విషయాన్ని దళిత సంఘాలు గుర్తించాలని కోరారు. రౌడీ షీటర్లు గంజాయి మత్తులో చిరంజీవిని చంపి ఉంటే దళిత మహిళకు అన్యాయం జరిగి ఉండేదన్నారు.

సీఎల్‌ఈఎస్‌ఏ నూతన కార్యవర్గం ఏర్పాటు



సమావేశంలో సీఎల్‌ఈఎస్‌ఏ ప్రతినిధులు

మంగళగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): కన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్, సర్వేయర్స్, ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తొలి కార్యవర్గ సమావేశం మంగళగిరిలో జరిగింది. సంఘం ఆవిర్భావంపై చర్చ, సర్వసభ్య సమావేశం, టెక్నికల్ సెమినార్లు, లోకల్ చాప్టర్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ చైర్మన్‌గా వేల్పుల రాము, చైర్మన్‌గా ఎం.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా కె.కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎన్.సుందరరాజు, ప్రధాన కార్యదర్శిగా నెలకంటి ఎన్‌వీఎస్ఎస్ మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్.సతీశ్‌కుమార్, కోశాధికారిగా యూఎస్ సంపత్‌కుమార్, మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. రాజమండ్రి జోన్ అధ్యక్షుడిగా ఏకే జిలానీ, అమలాపురం జోన్ అధ్యక్షుడిగా ఎస్.ఫణికుమార్, భీమవరం జోన్ అధ్యక్షుడిగా కేవీఎం కృష్ణ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

చదువులో జ్ఞానశ్రీ..దాతల చేయూత కావాలి

పెదకూరపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చిన్న నాటి నుంచి చదువులో ఎంతో ప్రతిభ కలిగి.. ప్రతి క్లాసులో అన్ని సబ్జెక్టుల్లో 95 శాతానికి పైగా మంచి మార్కులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.. పెదకూరపాడుకు చెందిన అవ్వారి జ్ఞానశ్రీ. తల్లి కుమారి, అమ్మమ్మ, తాతయ్య పర్యవేక్షణలో చదువును కొనసాగిస్తోంది. బాలిక తల్లి కుమారి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే..తన తల్లిదండ్రులు కూలీ పనుల ద్వారా వచ్చే డబ్బులతో కుమార్తెను చదివించుకుంది. దీంతో జ్ఞానశ్రీ 10వ తరగతిలో పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 587 మార్కులు సాధించింది. 2023లో జిల్లా స్థాయిలో ముందంజలో నిలిచింది. గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీలో 981 మార్కులు సాధించింది. జేఈఈ అడ్వాన్స్ పూర్తి చేసి.. జూన్ 2న విడుదలయ్యే ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. ప్రాథమిక విద్య స్థానికుల ఆర్థిక సాయంతో.. ఇంటర్మీడియెట్ దాతల విరాళాలతో పూర్తి చేసి చదువులో రాణిస్తోంది జ్ఞానశ్రీ. దాతలు చేయూతనిస్తే తన చదువుకు ఎటువంటి ఆటంకం కలగదని విద్యార్థిని కోరుకుంటోంది. ఆస్తులు లేకపోయినా.. చదువులో రాణిస్తున్న ఇలాంటి బాలికకు చే యూతనిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సహాయం చేయ దలచుకున్న దాతలు 72880 62392 నంబరు సంప్రదించాలని కోరారు.



అవ్వారి జ్ఞానశ్రీ

ఆసియా క్రీడల్లో రజితకు స్వర్ణం



కుంజా రజిత

మంగళగిరి సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి కుంజా రజిత ఆసియా క్రీడల్లో మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. దక్షిణ కొరియాలోని గూమి నగరంలో గురువారం జరిగిన 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన రజిత 400 మీటర్ల రిలే పరుగులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయి భారత మహిళా రన్నర్లు జిస్నా మాథ్యూ, రూప చౌదరి, శుభ వెంకటేష్‌తో కూడిన 400 మీటర్ల రిలే పరుగు జట్టులో రజిత కూడా పాల్గొంది. ఈ జట్టు 3.34 సెకన్ల వ్యవధిలో నిర్ణీత దూరాన్ని చేరుకుని ఫైనల్స్‌లో వియత్నాం, శ్రీలంక జట్లను అధిగమించింది. 2013 తర్వాత ఇదే ఈవెంట్‌లో తిరిగి స్వర్ణ పతకం సాధించడం విశేషం. రజితను ఎస్ఆర్ఎం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ ఆరోరా, ప్రోవైస్ చాన్సలర్ డాక్టర్ సతీశ్‌కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్స్ అనూప్‌సింగ్ సూర్యవంశీ, సుస్మితా సింగ్, శ్రీపతి తదితరులు అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

సన్నబియ్యంతో భోజనం

(5వ పేజీ తరువాయి)

దొడ్డ బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి జిల్లా నుంచి ఇందుకు అవసరమైన ఇండెంట్‌ను పాఠశాల విద్యాశాఖ పౌరసరఫరాల శాఖకు పంపింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జడ్పీ మండల పరిషత్ ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు 600కిపైగా ఉండగా 6.75 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు మరో 100 కిపైగా ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. పాఠశాల, కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి, వసతిగృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ధాన్యం సేకరించిన పౌరసరఫరాల శాఖ

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు, వసతిగృహాలకు అవసరాల నిమిత్తం రాష్ట్రస్థాయిలో ధాన్యం సేకరించి జిల్లాల వారీగా పంపిణీకి పౌరసరఫరాల శాఖకు ఏర్పాట్లు చేసింది. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో గోదాముల నుంచి డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్దేశించిన పాఠశాలలకు, హాస్టళ్లకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించింది. దాదాపు పదివేలకు పైగా మెట్రిక్ టన్నులు బియ్యం అవసరమని ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

ప్రతి ఒక్కరూ భోజనం చేసేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ భోజనం చేసేలా ఇప్పటికే మెనూలో మార్పులు తీసుకొచ్చారు. తాజాగా బియ్యం పంపిణీలో కూడా మార్పులు తీసుకు రానుండడంతో విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేసే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జల్‌జీవన్‌లో.. జాగు

(5వ పేజీ తరువాయి)

ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ పథకం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. నిధులున్నా పనులు ముందుకు సాగడంలేదు. దీంతో గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో అపరిశుభ్రమైన, ఫ్లోరైడ్ ఉన్న నీటిని అనేక ప్రాంతాల్లో ప్రజలు వినియోగించుకోవాల్సి వస్తోంది. తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం లేదు.

● జల్‌జీవన్ మిషన్‌లో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో ఉంది. రూ.508.16 కోట్ల అంచనాతో 1055 పనులు చేపట్టగా 219 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 16 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది.

● బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలో ఉంది. జిల్లాలో 19.82 శాతం నుంచి 40.84 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. రూ.205.22 కోట్ల అంచనాతో చేపట్టిన 723 పనుల్లో 223 మాత్రమే పూర్తయ్యాయి. 10 గ్రామాల్లో మాత్రమే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు.

● గుంటూరు జిల్లాలో జల్‌జీవన్ అమల్లోకి వచ్చిన అనంతరం 33,731 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో ఉంది. 308 పనులు చేపట్టగా 172 పూర్తయ్యాయి. 28 గ్రామాల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఇద్దరికి కరోనా

(5వ పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి

రోగులు మాస్కులు ధరించాలి

దగ్గు, తుమ్ములతో బాధపడే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్యవర్గాలు కోరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొవిడ్-19 కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించి రావాలని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచనలు చేశారు. జ్వరం, చలి, నీరసం, గొంతు మంట, ఒంటినొప్పులు, నోరు చేదుగా ఉండటం, వాసన తెలియకపోవడం, తలనొప్పి ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది. కొవిడ్ కేసులు ప్రబలిన దేశాల నుంచి ప్రయాణం చేసి వచ్చే వారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపింది.

ఆందోళన అవసరం లేదు



కొవిడ్-19పై ప్రజలు ఆందోళన చెందవద్దు. ప్రస్తుతం సర్క్యులేట్‌లో ఉన్నది ఒమిక్రాన్ రూపంలో ఉన్న జేఎన్1 వేరియంట్. ఇది అంత ప్రమాదకారి కాదు. ఈ వేరియంట్ బారిన పడిన వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఆస్పత్రిలో చేరి చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నా, ఇతరులకు పెద్ద హాని కలిగించే శక్తి ఉండదు. అనుమానిత లక్షణాలతో వచ్చే రోగుల కోసం ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక కొవిడ్ ఓపీ, 15 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.

- డాక్టర్ రమణ యశస్వి, జీజీహెచ్ సూపరింటెండెంట్



చుక్కపల్లి రాకేష్ నుంచి పత్రం పొందుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు.

వీధి కుక్కల నియంత్రణకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తోడ్పాటు

● నెలకు రూ.3 లక్షల చెల్లిస్తామని అంగీకార పత్రం

● అభినందించిన మేయర్, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో వీధి కుక్కల జనన నియంత్రణకు (ఏబీసీ) సంబంధించి నగరపాలక సంస్థకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం తోడ్పాటు అందించడం అభినందనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చిన పి4కు స్పందించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పయినీర్ గ్రూప్, చుక్కపల్లి శంకరరావు చారిటబుల్ ట్రస్ట్ తరుపున చుక్కపల్లి రాకేష్ ఏబీసీకి తోడ్పాటు అందిస్తామని శుక్రవారం నగర కమిషనర్ చాంబర్‌లో అంగీకార పత్రాన్ని మేయర్, కమిషనర్‌కు అందించారు.

మేయర్, కమిషనర్‌లు మాట్లాడుతూ నగరంలో సుమారు 30 వేల వీధి కుక్కలు ఉన్నాయని గుర్తించామని, వాటికి తక్షణం జనన నియంత్రణ సర్జరీలు, ర్యాబీస్ వ్యాక్సిన్ చేయించాల్సి ఉందన్నారు. ఏబీసీ, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ కోసం ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పయినీర్ గ్రూప్, చుక్కపల్లి శంకరరావు చారిటబుల్ ట్రస్ట్‌లు నెలకు రూ.3 లక్షలు వంతున 10 నెలల పాటు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. సదరు నిధులతో రోజువారీ షెడ్యూల్ సిద్ధం చేసుకొని, నగరంలో వీధి కుక్కలకు ఏబీసీ చేయించడం ద్వారా నగరంలో వీధి కుక్క కాటులు, ర్యాబీస్ వ్యాధి విస్తరణను అడ్డుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పయనీర్ గ్రూప్, చుక్కపల్లి శంకరరావు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌తో సమూల మార్పులు

గుంటూరు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ద్వారా వార్డులలో పారిశుధ్యంలో సమూల మార్పు ఉండాలని, నోడల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం కేవీపీ కాలనీ, భాను ప్రసాద్ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీల్లో స్పెషల్ శానిటేషన్ పనులు, వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలు, నల్లపాడులోని పలు ప్రాంతాల్లో పర్యటించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ స్పెషల్ శానిటేషన్ ద్వారా ఆయా వార్డులలో ప్రజలు సంతృప్తి చెందేలా పనులు జరిగేలా నోడల్ అధికారులు, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం నల్లపాడు హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి తక్షణం వీధి దీపాల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని డీఈఈని, డ్రెయిన్లను శుభ్రం చేయాలని, ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియర్ చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో టిడ్కో ఎస్ఈ ఉమాశంకరశాస్త్రి, ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్ కె.గురవయ్య, జీఎంసీ డీఈఈ శ్రీనివాస్, టిడ్కో డీఈఈ సేతుబాబు, ఎస్ఎస్ రాజేష్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చిన్న చూపు

గుంటూరు(తూర్పు), మే 30 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం పక్షపాతంగా వ్యవహరిస్తుందని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. బ్రాడీపేట, ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన వాటాలు, నిధులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని విమర్శించారు. పార్లమెంట్ స్థానాల పునర్విభజన పేరుతో 100 సీట్లకే దక్షిణాదిని పరిమితం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, దేశానికి రెండో రాజధానిగా హైదరాబాదును ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం జేఏసీ, ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కైలా జయసుధను ఆయన నియమించారు. సమావేశంలో రమణయ్య, వాసు, శ్రీనివాసరావు, ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

పుతుంబాక వెంకటపతి స్ఫూర్తితో ఉద్యమించాలి

గుంటూరు(తూర్పు), మే 30 (ఆంధ్రజ్యోతి) : దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణ కోసం పుతుంబాక వెంకటపతి స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం వెంకటపతి 33 వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎం నిర్మాణానికి, అభివృద్ధికి కృషి వెంకటపతి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాశం రామారావు, బి.లక్ష్మణరావు, చిస్టీ, బైరగాని శ్రీనివాసరావు, కే.పద్మ పాల్గొన్నారు.

రూ.989 కోట్లు తక్షణమే విడుదల చేయాలి



శివప్రసాద్ కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం నేతలు పాపారావు, జాస్తి వీరాంజనేయులు

గుంటూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.989 కోట్లు వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల రాష్ట్ర సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు తదితరులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.రెండు వేల కోట్ల ఉపాధి హామీ నిధులను వెంటనే విడుదల చేయాలని వినతి పత్రం లో పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకపోతే నిర్వహణ చాలా కష్టంగా మారిందన్నారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఉన్నారు.

నాసిరకం పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలి : హరి

గుంటూరు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, వాళ్ళు చేసిన పాపాలు ఇప్పుడు ప్రజలకు ప్రాణాపాయంగా మారాయని, వీటిపై వెంటనే విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాస్‌ను జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి కోరారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ ఛాంబర్ లో పులి శ్రీనివాస్‌కు ఆళ్ళ హరి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ప్రధానంగా 2021 నుంచి 2024 వరకు జరిగిన రోడ్లు, డ్రైనేజి, కల్వర్ట్‌లు వంటి నిర్మాణాల్లో అధిక పనులు నాసిరకంగా జరిగాయని, ఇప్పుడవి ప్రజలకు ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్ పులి శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యత లేని నాసిరక పనులపై ఒక వారం రోజుల్లో నివేదిక వచ్చేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర నాయకులు మహబుబ్ బాషా, కోలా అంజి, పడిసపోగు రమేష్, నండూరి స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాటాలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), మే 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న సీఐటీయూ పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఆ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మణరావు, ముత్యాలరావు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక శ్రీనివాసరావుపేటలోని మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్ లో జెండాను ఆవిష్కరించారు. జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు. గుంటూరు మల్లికార్జునరావు, చల్లాపల్లి కిన్నర్, బాలకృష్ణ, మణి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చిత్తడి నేలగా సిరిపురం తాగునీటి చెరువు

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరిపురం మంచినీటి చెరువును చిత్తడి నేలగా నోటిఫై చేస్తూ నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ప్రతిపాదన సిద్ధం చేయాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన శుక్రవారం జిల్లా చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఎజెండాకు సంబంధించి మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలోని మంచినీటి చెరువును చిత్తడి నేలగా ప్రకటించడానికి నిర్వహించిన గ్రామ సభలు, నిబంధన వివరాలను జిల్లా అటవీశాఖ అధికారి ఎం హిమ శైలజ సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం కన్జర్వేషన్ రిజర్వుగా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.

సిరిపురం చెరువు, ఉప్పలపాడు పక్షుల కేంద్రంపై ప్రతిపాదన పంపాలి

ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని కన్జర్వేషన్ రిజర్వుగా, సిరిపురంలోని మంచినీటి చెరువును చిత్తడి నేలగా నోటిఫై చేయడానికి గ్రామ సభలలో గ్రామస్తులు, సంబంధిత శాఖలైన రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అధికారులు సమ్మతి తెలిపినందున రాష్ట్ర స్థాయి ఆమోదం కోసం నోటిఫై ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నజీమా బేగం, పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్, మండల సర్వేయరు ఆంజనేయులు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, మేడికొండూరు ఎంపీడీవో తోట చందన, ఎఫ్ ఆర్‌ఓ పోతురాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హారిక, ఉప్పలపాడు సర్పంచ్ కర్నా టి శ్రీనివాసరావు, ఈడీసీ చైర్మన్ హరిబాబు, వైస్ చైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మెనోపాజ్ హైజీన్ దినోత్సవం



శానిటరీ ప్యాడ్‌లను అందజేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన హోప్ విన్ హాస్పిటల్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో నంబూరులోని జేఎంజే హైస్కూల్ ప్రాంగణంలోని ఉజ్వల హోంలో శుక్రవారం ప్రపంచ మెనోపాజ్ హైజీన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హోప్‌విన్ హాస్పిటల్ చైర్ పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమసుల్తానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలతో పాటు రుతుక్రమం ఆగిపోయిన తర్వాత వచ్చే ఆరోగ్య సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ఆమె వివరించారు. రుతుక్రమం సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతను, తీసుకోవాల్సిన ఆహారం వంటి విషయాలను ఆమె వివరించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా మహిళలకు శానిటరీ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ రోజ్‌లీన, వార్డెన్ మల్లేశ్వరి, ప్రశాంతి, ఆసుపత్రి మేనేజర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

గుంటూరు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. స్థానిక శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో యడ్ల రాజ్యలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ఫర్ మెన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని, ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకొని, వారికి అభినందనలు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ ఈ క్రీడలు మే 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయని, క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని కనబరచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్, నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, రాహుల్ చౌదరి, రత్న దివ్యాస్, పాఠశాల డైరెక్టర్ గింజుపల్లి ప్రసాదరావు, హెచ్ ఫౌండేషన్ సభ్యులు వెంకటేష్, నారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిగా నరసింహారావు

గుంటూరు సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారిగా యు. నరసింహారావు నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం శుక్రవారం జీఓ 358ని విడుదల చేసింది. పశ్చిమగోదావరి జిల్లా ఆత్మ పీడీగా ఆయన తొలుత నియమితులయ్యారు. అయితే అక్కడ జాయిన్ కాలేదని తెలిసింది. గుంటూరు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధుల సిఫార్సు తో నరసింహారావును జిల్లా వ్యవసాయ అధికారిగా నియమిస్తూ ఆ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ జిల్లా వ్యవసాయ అధికారిగా ఉన్న నున్న వెంకటేశ్వర్లును మరో చోటికి బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

కుక్కల ద్వారా వ్యాపించే..హైడాటిడ్ వ్యాధి!

● శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన వైద్యులు

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కుక్కల ద్వారా సంక్రమించే ప్రమాదకరమైన జూనోటిక్ వ్యాధి..హైడాటిడ్. ఈ వ్యాధి బారిన పడి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగికి శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం సాధారణ శస్త్రచికిత్స వార్డులో జరిగిన విలేకర్ల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్ ఈ కేసు వివరాలను తెలిపారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మదారంనకు చెందిన పాలిపోగు ప్రసాద్ (62) మూడు నెలల కిందట ప్రమాదకరమైన హైడాటిడ్ వ్యాధికి గురయ్యాడు. తీవ్రమైన జ్వరం, కామెర్లు, కడుపు నొప్పి, చలి వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం గత నెల నాల్గవ తేదీన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేరగా, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ యేకుల కిరణ్‌కుమార్ పరీక్షించారు. బాధితుడు కాలేయంపై ఏర్పడ్డ నీటి బుడగ (హైడాటిడ్ సిస్ట్)తో బాధపడుతున్నట్లు గుర్తించారు. రోగికి రక్తహీనత, ఊపిరితిత్తుల సమస్య ఉండటంతో మొదట వాటికి చికిత్స చేశారు. అనంతరం ఏప్రిల్ 17న నాలుగు గంటల పాటు శ్రమించి ఓపెన్ సర్జరీ చేసి 20 సెంటీ మీటర్ల మేర ఏర్పడిన కాలేయం నీటిబుడగలను తొలగించారు. సర్జరీ తర్వాత నెల వైద్యుల పర్యవేక్షణలో ఉంచి సంరక్షించారు. రోగి కోలుకోవడంతో మే 18న డిశ్చార్జ్ చేశారు. అరుదైన శస్త్రచికిత్సతో రోగి ప్రాణాలు కాపాడిన డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు. బయట రూ.10 లక్షల విలువైన సర్జరీని ఎన్టీఆర్ వైద్య సేవకింద ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు.



కోలుకున్న ప్రసాద్‌తో కిరణ్‌కుమార్, రమణ యశస్వి

తరుణ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించాలి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపించినందున రాబోయే కాలంలో మలేరియా, డెంగీ, చికున్ గన్యా, టైఫాయిడ్, కామెర్లు, అతిసార సారా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి ఆదేశించారు. ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందితో పాటు స్థానిక ప్రజలను భాగస్వాములు చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. మే 31న వరల్డ్ నో టుబాకో డే పురస్కరించుకొని ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పొగాకు ఉత్పత్తులు వాడకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలని ఆమె కోరారు. గర్భిణులకు ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించే విధంగా ఆరోగ్య సిబ్బంది మ్యాపింగ్ సిద్ధం చేసి తమ పరిధిలో ఉన్న సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, జిల్లా కేంద్ర ఆసుపత్రితో సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు.

కారు చోరీ కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు, పక్కన నిందితుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : కారు చోరీ చేసిన కేసులో నిందితుడైన కడప జిల్లా కలసపాడు మండలం ఎగువ రావ ్పురం గ్రామానికి చెందిన పనకపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పట్టాభిపురం పోలీ సులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. రాంప్రసాద్‌రెడ్డి 2009 నుంచి 2014 వరకు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు చెందిన ఎన్ఆర్ఐ అగ్రిటెక్ ఆఫీస్‌లో డ్రైవర్‌గా పని చేసినట్లు చెప్పాడు. తదుపరి అతను హైదరాబాద్ వెళ్లి ఓలా కారు డ్రైవర్‌గా, కొంత మంది వద్ద కారు డ్రైవర్‌గా పని చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం తనకు పని లేనందున గతంలో పని చేసిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆఫీస్‌లో పని చేద్దామని అనుకొని గత 28న తేదీన గుంటూరు వచ్చి విద్యానగర్‌లో ఉన్న ఎన్ఆర్ఐ అగ్రిటెక్ ఆఫీస్ వద్దకు వచ్చి వైస్ చైర్మన్‌గా పని చేస్తున్న కాకుమాను సాంబశివరావుని కలసి పని కావాలని అడిగాడు. అందుకు సాంబశివరావు ప్రస్తుతం పని లేదు, కొద్ది రోజులు తరువాత చూద్దాం అని చెప్పగా, తన స్వగ్రామం కడపకు రెండు రోజులు ఇక్కడే ఉండి వెళతానని చెప్పి గత పరిచయాల వలన ఆఫీస్ వద్దనే ఉన్నాడు. 28న రాత్రి సుమారు 9 గంటల సమయములో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి డ్రైవర్‌గా పని చేసే సంతపరపు నాగార్జున ఎన్ఆర్ఐ అగ్రిటెక్ ఆఫీస్‌కు చెందిన ఏపీ సీజడ్ 07 2137 నెంబర్ గల కారును ఆఫీస్ వద్ద పార్కింగ్ ప్లేస్‌లో పార్కింగ్ చేసి తాళాలను ఆఫీస్‌లో పెట్టి వాచ్‌మన్‌కు చెప్పి వెళ్లిపోయాడు. రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో హైదరాబాద్‌లో ఉన్న తన లవర్‌ను కలసి వద్దామని అనుకుని ఆఫీస్‌లో ఉన్న తాళాల సహాయంతో పార్కింగ్ ప్లేస్‌లో ఉన్న కారును, తన ఫోన్ రీచార్జ్ అయిపోయినందున తన లవర్‌తో మాట్లాడ టానికి ఫోన్ అవసరమై ఆఫీస్‌లో ఉన్న వాచ్‌మన్ ఫోన్ దొంగిలించి తీసుకుని వెళ్ళి హైదరాబాద్‌లో అబ్దుల్లాపూర్ మెట్‌లో తన లవర్ ను కలసి తిరిగి కారు ఇచ్చేద్దామని అదే కారును డ్రైవింగ్ చేసుకుంటూ గుంటూరు వచ్చాడు. ఈ క్రమంలో గుజ్జనగుండ్ల సెంటర్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు.

మెట్లమీద నుంచి జారిపడి వృద్ధురాలి మృతి

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ 7/7 లైన్ కి చెందిన సాగిరి అచ్చమ్మ(67) అనే వృద్ధురాలు మెట్ల మీద నుంచి కాలుజారిపడి మృతి చెందింది. అచ్చమ్మ ఈ నెల 29న తెల్లవారుజామున వరండాలో జారీ మెట్ల మీద పడి గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. అచ్చమ్మకు ఇరువురు కుమార్తెలు సంతానం ఉన్నారు. అచ్చమ్మ మృతిపై ఆమె కూతురు తిరుమలశెట్టి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఈఎల్‌సీ ఆస్తులు అమ్మినా, లీజుకు ఇచ్చినా చట్టప్రకారం నేరం

● విశ్రాంత న్యాయమూర్తి జోసెఫ్ కురియన్

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఏఈఎల్‌సీకి చెందిన ఆస్తులు విక్రయించడం గానీ, లీజుకు ఇవ్వడం గాని చేయడం చట్ట ప్రకారం నేరమని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన కమిటీ ప్రతినిధి విశ్రాంత న్యాయమూర్తి జోసెఫ్ కురియన్ తెలిపారు. పొన్నూరు ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో శుక్రవారం ఏఈఎల్‌సీ ప్రతినిధుల మహాసభ కనపర్తి ఆశీర్వాదం అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సభలో ఏఈఎల్‌సీ బిషప్‌గా సీహెచ్ ఏలియాని ఎంపిక చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో ప్రతినిధుల సభ ప్రారంభించగానే ఏఈఎల్‌సీలో ఉన్న సమస్యలు పరిష్కరించి అందరిని ఏఈఎల్‌సీ కానిస్ట్యూషన్ ప్రకారం ఒకే తాటి మీదకి తీసుకొచ్చి ఒకే ఎలక్షన్ జరపాలని హైకోర్టు నియమించిన జోసఫ్ కుర్యన్ రిటైర్డ్ జడ్జిని చర్చిలో ఉన్న విధివిధానాలను పరిశీలిస్తూ కానిస్ట్యూషన్ ప్రకారం అందరితో చర్చిస్తున్న సమయంలో ఈ ప్రతినిధుల మహాసభ జరగటం అనేది ఇది చట్టరీత్యా నేరమని జస్టిస్ కుర్యన్ అన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసులు ఈ సభకు వచ్చి మీరు చేసేది చట్టరీత్యా నేరమని దీనిని ఆపివేసి వెళ్ళిపోవలసినదిగా సూచించారు. లేనిపక్షాన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో వారు సభను రద్దు చేసుకుని వెళ్ళిపోయారన్నారు.

న్యూరాలజీ వార్డుకు 40 పడకల విరాళం

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ వార్డుకు 40 పడకలు విరాళంగా అందజేసేందుకు న్యూరాలజిస్ట్ డాక్టర్ అనిల్‌కుమార్ ముందుకు వచ్చారు. జీఎంసీ పూర్వ విద్యార్థి అయిన విజయవాడకు చెందిన అనిల్ న్యూరో అండ్ ట్రామా సెంటర్ అధినేత, న్యూరాలజిస్ట్ డాక్టర్ అనిల్ జీఎంసీలో న్యూరాలజీ కోర్సు చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారీ అభ్యర్థన మేరకు, రూ.4 లక్షల వ్యయంతో న్యూరాలజీ వార్డులో ఫీమేల్ వార్డులో 20 పడకలు, మేల్ వార్డులో 20 పడకలు విరాళంగా ఇచ్చేందుకు డాక్టర్ అనిల్‌కుమార్ అంగీకరించారు. త్వరలో వార్డులో పాత పడకలు తొలగించి ఆ స్థానంలో కొత్త పడకలను ఏర్పాటు చేస్తారు.

సీఐలను సస్పెండ్ చేయాలి : ఐఎల్‌ఏ

గుంటూరు(లీగల్), మే 30(ఆంధ్రజ్యోతి): తెనాలిలో ఓ న్యాయవాదితో పాటు మరో ఇద్దరిని ఏప్రిల్ 25న నడి రోడ్డు పై బహిరంగంగా కొట్టి హింసించి, మూడు రోజులు అక్రమంగా నిర్బంధించిన సీఐలు రాములు నాయక్, రమేష్ బాబులను, ఆ సంఘటన లో పాల్గొన్న ఇతర పోలీసులను సస్పెండ్ చేయాలని, వారిపై మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఇద్దరు సీఐల చర్యలను సమర్థించిన ఎస్పీ సతీష్ కుమార్‌ను వెంటనే బదిలీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో విధుల బహిష్కరణ నిర్వహించి జిల్లా కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంత కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షురాలు గీతా వాణి, నగర అధ్యక్షుడు మొఘల్ కాలేషా బేగ్, మధిర నాగేశ్వరరావు, మాణిక్యరావు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, హృదయ శుద్ధి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంతోపాటు హృదయ శుద్ధి కలుగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. యోగా ఆంధ్రప్రదేశ్ 2025లో భాగమవుతున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు రెండు కోట్ల మందితో జూన్ 21వ తేదీన యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో 1వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగ తరగతులు చేపట్టనున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యోగా గురువు జుజ్జూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాతో కేవలం ఆరోగ్యమే కాదని, మన జీవనశైలి మారుతుందన్నారు. అనంతరం యోగాంధ్రప్రదేశ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు

మహానాడుతో సువర్ణాధ్యాయం

నిన్నటికి, రేపటికి వారధిగా మహానాడు నిలిచిందని, దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రస్తుత ప్రజా మార్పునకు అనుగుణంగా పని చేస్తోందని తెలిపారు. ఇలాంటి చరిత్రాత్మకమైన కార్యక్రమంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజం వచ్చిందని చెప్పారు. మెడపై కత్తి పెట్టి జై జగన్ అనమంటే జై చంద్రబాబు అని నినదించిన చంద్రయ్య లాంటి కార్యకర్తలే పార్టీకి బలమని చెప్పారు. గుంటూరు నుంచి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.

వెన్నుపోట్లు, గొడ్డలిపోట్లకు చిరునామా వైఎస్ కుటుంబం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోట్లు, గొడ్డలి పోట్లకు బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ కుటుంబమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లీ, చెల్లెళ్లకు వెన్నుపోటు పొడవడమేకాక, సొంత బాబాయిని సైతం తమ్ముళ్ల చేత గొడ్డలి పోట్లకు బలి చేసిన చరిత్రహీనుడు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి అని మండిపడ్డారు. వెన్నుపోటు వీరుడిగా పేరు తెచ్చుకున్న జగన్ 'వెన్నుపోటు దినం' అంటూ నిరసనలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. కడపలో జరిగిన మహానాడు కనీవినీ ఎరుగని స్థాయిలో విజయవంతం కావడంతో వైసీపీ నేతలకు మతి భ్రమించిందని అన్నారు. మాజీ మంత్రులు పరిటాల రవి, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుల్లోని కీలక ముద్దాయిలు, సాక్షులు ఒకరి వెంట ఒకరు చనిపోవటం వెనుక ముమ్మాటికీ జగన్‌రెడ్డి హస్తముందని కనపర్తి ఆరోపించారు. 1978 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిరాగాంధీకి వైఎస్ రాజశేఖరరెడ్డి వెన్నుపోటు పొడిచి రెడ్డి కాంగ్రెస్ తరుపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందితే, 2012లో జగన్మోహనరెడ్డి మళ్ళీ కాంగ్రెస్‌కి వెన్నుపోటు పొడిచి మరో రెడ్డి కాంగ్రెస్‌ని స్థాపించాడని అన్నారు. సీఎం పీఠం కోసం 1990లో హైదరాబాద్‌లో మారణహోమం సృష్టించిన చరిత్ర వైఎస్సార్‌ది కాదా అని ఆయన ప్రశ్నించారు. మద్యం కేసులో జగన్‌రెడ్డి పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయాడని, ఆయన అరెస్టును ఆపడం ఎవరితరం కాదని కనపర్తి చెప్పారు.

చరిత్రలో నిలిచిపోతున్న కడప మహానాడు

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్



డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు సిటీ, మే 30(ఆంధ్రజ్యోతి) : కడప గడపలో జరిగిన మహానాడు చరిత్రపుటల్లో నిలిచిపోతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ఆయన మహానాడు కార్యక్రమంలో పాల్గొని తిరిగి గుంటూరు వచ్చిన సందర్భంగా శుక్రవారం మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టించి పని చేసి మహానాడు విజయానికి కృషి చేశారని తెలిపారు. 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల వ్యవధిలో ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో పార్టీని తన భుజాలపై వేసుకుని విజయవంతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడుపుతున్నారని తెలిపారు. ఒక మహా పండుగను మహానాడుతో చూశానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మొదటిసారిగా నిర్వహించిన మహానాడు అందరికీ గుర్తుండేలా నిర్వహించారని చెప్పారు. మహానాడులో పేద, బడుగు, బలహీన వర్గాలకు, రాష్ట్ర ప్రజలకు కావలసిన తీర్మానాలను ప్రవేశపెట్టి అందరి అభిమానాన్ని చూరగొన్నారని చెప్పారు. యువ నాయకుడు, మంత్రి నారా లోకేశ్ యువతలో ఉత్సాహాన్ని నింపారన్నారు. అతిరథ మహారథులతో జరిగిన ఈ మహానాడు చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని సురేష్ కుమార్ అన్నారు.

చికాగోలో ఉత్తమ అథ్లెట్‌గా అక్షర గింజుపల్లికి అవార్డు



అక్షర గింజుపల్లి

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అమెరికా దేశంలోని చికాగో రాష్ట్రంలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన ప్రత్తిపాడుకు చెందిన అక్షర గింజుపల్లి అథ్లెట్‌గా రాణిస్తున్నారు. ఇల్లినోస్ చికాగోలోని లేక్ ఫారెస్టు అకాడమీ ఈ ఏడాదికి ప్రకటించిన ఉత్తమ అథ్లెట్‌లో అక్షరకు ఈ అవార్డు లభించింది. అక్షర వాలీబాల్, బాస్కెట్‌బాల్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో క్రీడలలో పాల్గొని ప్రధాన క్రీడాకారిణిగా ప్రతీ గేమ్ ఈవెంట్‌లో నిలిచింది. దీంతో లేక్ ఫారెస్టు అకాడమీ ఈ అవార్డుని ప్రదానం చేసింది. అక్షరకు ఉత్తమ అథ్లెట్ అవార్డు రావడంపై ఆమె తాత గింజుపల్లి వీరయ్య, అరుణకుమారి హర్షం వ్యక్తం చేశారు.

భూ మాయకు పరిష్కారమేదీ?

- ప్రభుత్వ భూముల విస్తీర్ణం పెంపు
- పలు పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు
- బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు
- మాచవరంలో అక్రమార్కుల దోపిడీ..
- పరిశీలనతో కాలం వెళ్లదీస్తున్న అధికారులు
- ఏళ్లు గడుస్తున్నా వెబ్ ల్యాండ్‌లో తొలగని పేర్లు



మాచవరం తహసీల్దారు కార్యాలయం

మాచవరం, మే 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా జనాభా, ఆస్తుల విలువ పెరగడం సమాజంలో చూస్తుంటాం. కానీ, ఎక్కడా లేని విధంగా మాచవరం మండలంలో భూమి విస్తీర్ణం పెరగడం పెరిగింది. బ్రిటీషర్లు తయారు చేసిన ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులను మార్చి భూముల విస్తీర్ణం పెంచడంలో ఇక్కడ పని చేసిన రెవెన్యూ అధికారులకే చెల్లింది. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్ భూముల విస్తీర్ణం పెంచి... ఇష్టానుసారం వెబ్ ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయించుకొని.. బ్యాంకుల్లో రూ.లక్షల రుణాలు పొందారు. ఈ అక్రమాలు బయట పడినా.. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

మాచవరం రెవెన్యూ మాయ..

మాచవరం మండలంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇక్కడ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన అధికారులు ప్రభుత్వ భూములకు కూడా సర్వే సర్టిఫికెట్లు ఇచ్చి వెబ్ ల్యాండ్‌లో పేర్లు నమోదు చేశారు. సహజంగా పట్టా భూములు సర్వే చేసి సర్టిఫికెట్లు ఇస్తారు. కానీ, ఇక్కడ పనిచేసిన అధికారులు మాత్రం సర్వే నంబర్లతో సహా.. ప్రభుత్వ భూమి వివరాలను వారి అనుకూలమైన వ్యక్తులకు ఇస్తారు. సర్వే సర్టిఫికెట్‌తో పాటు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసే విధంగా బేర సారాలు కుదుర్చుకుంటారు.

వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం పెంపు..

మండలంలోని వేమవరం, తాడుట్ల, పిన్నెల్లి, పిల్లుట్ల తదితర గ్రామ రెవెన్యూ శివార్లలో ఆర్‌ఎస్‌ఆర్ రికార్డు కంటే అడంగల్, వెబ్ ల్యాండ్‌లలో భూమి విస్తీర్ణం అమాంతంగా పెంచేశారు. ఉదాహరణకు వేమవరం రెవెన్యూ శివార్లలో 116 సర్వే నంబరులో మొత్తం విస్తీర్ణం 14 సెంట్లు ఉండగా.. అది కాస్త 9.52 సెంట్లు విస్తీర్ణంగా నమోదైంది. అసలు భూ యజమాని గుమ్మా నారాయణమ్మ కాగా.. వెబ్ ల్యాండ్‌లో వేమవరం గ్రామానికి సంబంధం లేని వారి పేర్లు కూడా నమోదై ఉన్నాయి. అదే విధంగా సర్వే నంబరు 126/1లో 56 సెంట్లు ఉండగా భూమి ఉండగా.. అది కాస్త 9.11 సెంట్లు వెబ్ ల్యాండ్‌లో నమోదైంది. ఇక్కడ కూడా ఈ గ్రామానికి సంబంధం లేని వారి పేర్లు నమోదు కావటం విశేషం. 385/2లో 2.68 సెంట్లు ఉండగా వెబ్ ల్యాండ్‌లో 20.53 సెంట్లుగా విస్తీర్ణం పెంచారు. 404/39లో 64.73 సెంట్లు ఉండగా దానిని 82.37 సెంట్లుగా నమోదు చేశారు. 404/43లో 104.42 సెంట్లు ఉండగా దానిని 116.48 సెంట్లుగా పెంచి వేశారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు అనేక సర్వే నంబర్లలో ఉన్న భూమి కంటే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన విస్తీర్ణం అధికంగా ఉంది. దీనిని చూపించి, అక్రమార్కులు బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు.

చర్యలు శూన్యం..

నమోదైన పేర్లు దొంగవి అని తెలిసినప్పటికీ అధికారులు రికార్డుల నుంచి తొలగించక పోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి, పరిశీలన అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో జాబితాలను ప్రదర్శించి చేతులైతే దులుపుకున్నారు కానీ.. అక్రమ పేర్లను వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించడంలో ఎందుకు అశ్రద్ధ వహిస్తున్నారో.. వారికే తెలియాలి. అంతేగాకుండా మాచవరం మండలంలో ముంపునకు గురైన పులిచింతల ప్రాజెక్టు కింద పొలాలనూ కూడా వెబ్‌ల్యాండ్‌లో చూపించి.. ఆయా గ్రామాల బ్యాంకుల్లో లక్షలాది రూపాయల రుణాలు తీసుకున్న దాఖలాలు కోకొల్లలు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భూ మాయ పై లోతుగా విచారణ జరిపి.. అక్రమంగా వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసిన పేర్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వేలో తొలగిపోతాయి



వెబ్ ల్యాండ్‌లో అక్రమ పేర్లు త్వరలో జరగనున్న భూ రీ సర్వేలో తొలగిపోతాయి. త్వరలో వేమవరం గ్రామంలో రీ సర్వే జరుగుతుంది. ఆర్ఎస్ఆర్ దాఖలా కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన దొంగ పేర్లను తక్షణమే తొలగిస్తాం.

- నాగ మల్లేశ్వరరావు,
తహసీల్దార్, మాచవరం

అతివలకు డిజిటల్ లక్ష్మీ కటాక్షం



శిక్షణలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

సత్తెనపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది డ్వాక్రా మహిళలు, స్థానికులు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను పొందే మార్గం తెలియక, దరఖాస్తు ఎలా చేయాలో అవగాహన లేక ఇబ్బందులు పడుతన్నారు. దీనిని ఆసరగా చేసుకొని కొందరు మధ్యవర్తులు వారి నుంచి దరఖాస్తు, ఆన్‌లైన్ సేవలకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం 'డిజిటల్ లక్ష్మి' సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, డిగ్రీ పూర్తి చేసిన డ్వాక్రా మహిళలను గుర్తించి డిజిటల్ లక్ష్మిగా ఎంపిక చేస్తున్నారు. వారికి ఉపాధి కల్పించి ఆర్థిక చేయూత అందించడంతో పాటు.. ప్రజలకు సేవలందించేలా ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో 21, వినుకొండలో 15, గురజాలలో ఐదుగురు, దాచేపల్లిలో ఎనిమిది మంది, పిడుగురాళ్లలో 18, నరసరావుపేటలో ఏడుగురు, మాచర్లలో 13, చిలకలూరిపేటలో 13 మందిని నేటికి డిజిటల్ లక్ష్మీలుగా ఎంపిక చేసి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వారికి ఆయా పురపాలక సంఘ కార్యాలయాల్లో శిక్షణ కూడా ఇస్తోంది. మీ-సేవా కేంద్రం మాదిరిగా డిజిటల్ లక్ష్మిలు సేవలందించనున్నారు. తమ ఇంటి ముందే కొద్ది పాటి స్థలం ఉంటే దుకాణాన్ని పెట్టుకొనేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు రూ.2లక్షల వరకు బ్యాంక్ రుణం ఇవ్వనున్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



టెన్నిస్ ఆడుతున్న ఏసీబీ డైరెక్టర్ జయలక్ష్మి

గుంటూరు(తూర్పు), మే 30(ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని ఏసీబీ డైరక్టర్ ఆర్.జయలక్ష్మి పేర్కొ న్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఓపెన్ టెన్నిస్ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. క్రీడలకు దూరంగా ఉండటంతో చిన్నవయస్సులోనే ఊబకాయం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో అతిథి అటవీ చీఫ్ కన్జర్వేటర్ బీఎన్ఎన్ మూర్తి మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పిస్తే ఏ పీ టెన్నిస్ హబ్‌గా ఆవిర్భవిస్తుందన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ అండర్ 16 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు సహకరించిన సీనియర్ టెన్నిస్ ఆటగాడు ఎస్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, సీనియర్ టెన్నిస్ కోచ్‌లు బి.సాయి, అలపాటి సురేష్, అహ్మద్ పాల్గొన్నారు.

యోగాసనం..ఆరోగ్యానికి శాసనం

- యోగాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- శారీరక ఆరోగ్యం, మనసుకు ఆనందం
- యోగాంధ్ర నిర్ణయంపై ప్రజల్లో హర్షం
- నెల రోజులు యోగాపై విస్తృత ప్రచారం
- జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం





గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగా.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించే ఆయుధం. దీని వల్లనే వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ చూపుతున్నారు. యోగాసనాలకు కోసం కొంత సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా శిక్షకులు, యోగా కేంద్రాల సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలను రూపుమాపే



అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రపంచ వ్యాప్తంగా నమ్ముతున్నారు. దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది. మొత్తమ్మీద మన జీవితంలో ఇప్పుడు యోగ బాగమైంది. యోగాను తన దైనందిన జీవితంలో నిత్య కృత్యంగా మార్చుకున్నందు వల్లే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వయసులో కూడా అలసట, అలుపు లేకుండా ఆరోగ్యవంతుడిగా ఉంటున్నారు. యోగా గొప్పతనాన్ని గుర్తించడం వల్లే.. యోగా పట్ల అందరూ ఆకర్షితులయ్యేలా చేయాలని ఆయన కంకణం కట్టుకున్నారు. అందుకే జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గొప్పగా నిర్వహించి, యావత్ దేశం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు నుంచే రాష్ట్రంలోని ప్రతి కుటుంబం యోగాను ఆచరించేందుకు ప్రయత్నించాలని మహానాడు వేదికగా ఆయన పిలుపునిచ్చారు.

నెల రోజులు రాష్ట్రంలో విస్తృత ప్రచారం

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో రాష్ట్రంలో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో రెండు కోట్ల మందిని భాగస్వాములు చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రత్యక్షంగా ఏడు లక్షలు మంది పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రతి గ్రామంలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. యోగా ప్రాధాన్యతను ప్రజలకు వివరించే బాధ్యత ఉన్నతాధికారులకు అప్పగించారు.

పెరిగిన ప్రాధాన్యం

ఒత్తిడితో కూడిన యాంత్రిక జీవితంలో యోగా ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో యోగాను అభ్యసిస్తున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంది. ఆ సంఖ్యను మరింతగా పెంచాలని చెబుతున్నారు. ముఖ్యంగా యువత, మహిళలు యోగా పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచిస్తున్నారు. వైద్య నిపుణులు కూడా యోగా చేయాలని చెబుతున్నారు.

ఆసనాలు, ఉపయోగాలు..

భుజంగాసనం

పాము పడగ చిత్తినట్లు ఆకారం కలిగిన ఈ ఆసనం వేయడంతో చాతి భాగం విప్పారుతుంది. ఊపిరితిత్తులు బలపడతాయి. వెన్ను దృఢంగా ఉంటుంది. నడుం నొప్పి తగ్గుతుంది. ఈ ఆసనంతో ఎముకలకు బలం చేకూరుతుంది.

ధనురాసనం

ధనుస్సును పోలిన ఈ ఆసనం ఎత్తు పెరిగేందుకు ఉపయోగపడుతుంది. కీళ్ల సంబంధ వ్యాధులు తగ్గుతాయి. మలబద్ధకం పోతుంది. షుగర్ నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా యువత ఈ ఆసనం నేర్చుకోవాలి.

పశ్చిమోత్తాన ఆసనం

ఈ ఆసనం ద్వారా పొట్ట సంబంధ వ్యాధులు తగ్గుతాయి. జననాంగాలకు వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. మహిళలు, వృద్ధులు అభ్యసించాలి.

ఓస్ట్రాసనం

ఒంటె ఆకారాన్ని పోలిన ఈ ఆసనం వల్ల నడుం నొప్పి తగ్గి, వెన్ను సామర్థ్యం పెరుగుతుంది. సర్వే కాల్ స్పాండిలైటిస్ బాధ పడే వారికీ ఈ ఆసనం ఎంతో ఉపయోగం.

శవాసనం

దీనిని అమృతాసనం అని కూడా పిలుస్తారు. ఆసనాల ప్రారంభంలోనూ, మధ్యలోనూ, పూర్తయిన తర్వాత కూడా దీనిని వేసుకోవాలి. దీంతో శరీరానికి ప్రశాంతత లభిస్తుంది. అన్ని వయసుల వారూ ఆచరించవచ్చు.

శశాంకాసనం

చంద్రుని ముఖం వలె ప్రకాశించే రూపును కలిగించే ఈ ఆసనంతో తలనొప్పి ఒత్తికి తగ్గుతుంది. ఊపిరితిత్తులకు ప్రాణ వాయువు అందజేస్తుంది. కోపం వంటివి మెల్లగా తగ్గుముఖం పడతాయి. బీపీ, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులతో బాధపడేవారు ఈ ఆసనాన్ని ఆచరించవచ్చు.

త్రిభుజాసనం

ఇది వెన్నుముకను, కాళ్లను సాగదీస్తుంది, నడుము, భుజాలను బలంగా మారుస్తుంది.

భుజంగ ఆసనం

ఇది వెన్నుముకను పైకి ఎత్తి, కడుపు, చాతి కండరాలను బలపరుస్తుంది.

అధోముఖ స్వ నా ఆసనం

ఇది మొత్తం శరీరానికి బలం వశ్యతను ఇస్తుంది, నడుమును చేతులను సాగదీస్తుంది.

తలాసనం

ఇది మెదడుకు, శరీరం మొత్తానికి బలం చేకూరుస్తుంది. ముఖ్యంగా మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

గరుడాసనం

శరీరానికి సమతుల్యతను చేకూరుస్తుంది. ముఖ్యంగా దీర్ఘకాల వ్యాధుల నివారణకు ఈ ఆసనం ఆచరించవచ్చు.

80 ఏళ్ల వయసులోనూ..

గుంటూరు బ్రాడీపేటలో స్థిర నివాసం ఏర్పరచుకొని.. యోగా శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ జైహింద్ ఎనిమిది పదుల వయసులోనూ క్లిష్టతరమైన ఎన్నో ఆసనాలు వేసి అందరిని అబ్బురపరుస్తున్నారు. 2001లో జైహింద్ దంపతులు యోగా పట్ల ఆకర్షితులయ్యారు. దాని గొప్పతనాన్ని గుర్తించి అందరిని ఆరోగ్యవంతులుగా చేయాలనే సంకల్పంతో 2006లో గుంటూరులో శిక్షణ కేంద్రం ప్రారంభించారు. వాస్తవానికి వీరి స్వస్థలం బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామం. కానీ, ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడే స్థిరపడిపోయారు. ఆయన సతీమణి సుబ్బాయమ్మ కూడా యోగ విద్యలో పేరు గడించారు. విశేషమేమిటంటే యోగాతో చేకూరిన ఆరోగ్యంతో దంపతులిద్దరూ వెటరన్ క్రీడల్లో కూడా రాణించి ఎన్నో పతకాలు సాధించారు.

యోగా నియమాలు ఇలా

- సాధకులు విధిగా ప్రార్థనతో ప్రారంభించి..ముగించాలి.
- ఆందోళన, అలసట, ఆకలి ఉన్నపుడు యోగాకి దూరంగా ఉండాలి.
- ఆసనాల ముందు నీరు తాగితే మంచిది. తేలికైన వస్త్రాలు ధరించాలి.
- రుతుక్రమ సమయంలో మహిళలు యోగాకి దూరంగా ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.
- గర్భిణులు మొదటి నాలుగు నెలలు శిక్షకుల పర్యవేక్షణలో అసనాలు వేయొచ్చు.

అతిథులు.. వెళ్లిపోతున్నారు!

ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనం

- ఆలనాపాలనా చూసేవారు కరువు
- గుర్రపు డెక్కతో నిండిపోయిన చెరువు
- నీరు లేక విడిది మార్చుకుంటున్న వలస పక్షులు
- కన్జర్వేషన్ రిజర్వుగా గుర్తింపుతోనే సరి..
- వాచ్‌మన్‌కు పది నెలలుగా జీతం ఇవ్వని దుస్థితి



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క



గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పక్షులకు విడిదిగా ఆశ్రయం కల్పిస్తున్న ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ఆలన పాలన కరువైంది. ఈ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న గ్రామ పర్యావరణ అభివృద్ధి కమిటీ నిధుల కొరతతో సతమతమవుతోంది. కనీస నిర్వహణ కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. పక్షులకు నీరు లభ్యం కాక పోతుండంతో ఇతర ప్రాంతాలకు వలన వెళ్లిపోతున్నాయి. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంచినీటి చెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో పక్షులకు ఎలాంటి ఆహారం లభించడం లేదు. ఒకప్పుడు స్థానిక పర్యాటకులనే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని కూడా ఆకర్షించిన ఈ పక్షి కేంద్రం నేడు దయనీయమైన స్థితికి చేరుకుంది. అవసరం లేని పనులకు దుబారగా నిధులు ఖర్చు చేసే ప్రభుత్వ శాఖలు జీవ వైవిధ్యానికి మారుపేరు అయిన ఈ పక్షుల కేంద్రానికి రూపాయి కూడా వెచ్చించకపోవడం దారుణం.

పలు దేశాల పక్షుల విడిది..

ఉప్పలపాడులోని మంచినీటి చెరువుకు పాతికేళ్ల క్రితం నుంచే వివిధ దేశాల నుంచి పక్షులు వలస వచ్చేవి. ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉండటంతో సైబీరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల నుంచి కూడా వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి పక్షులు విడిదికి వచ్చేవి. మొదట్లో అటవీ శాఖ ఆధీనంలో ఈ కేంద్రం ఉండేది. ఆ తర్వాత గ్రామ పర్యావరణ అభివృద్ధి కమిటీ ఆధీనంలోకి తీసుకొంది. ఇక్కడ చెరువులో ఉన్న చెట్లపై గుడ్లు పెట్టేందుకు.. వాటిని పొదిగేందుకు పక్షులకు అనువైన వాతావరణం ఉంది. చైనా, నేపాల్, హిమాలయాల నుంచి పెలికాన్స్, నైజీరియా నుంచి పెయింటెండ్ స్టార్క్స్, శ్రీలంక, ఆఫ్రికా నుంచి ఓపెన్ బిల్ స్టార్క్స్, దక్షిణాఫ్రికా నుంచి వైట్ ఐబిస్ వంటి పక్షులు వస్తుంటాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. చెరువుకు సమీపంలో మాగాణి ఉండటంతో వాటికి వ్యాపించే చీడపీడలను ఇవి ఆహారంగా తీసుకొంటాయి. ఎక్కువగా శీతాకాలంలో పక్షులు ఇక్కడికి వస్తుంటాయి. కొన్ని నెలల పాటు ఇక్కడే ఉండి గుడ్లు పెట్టి పొదిగి పిల్లలకు ఎగరడం వచ్చే వరకు ఆలనపాలన చూస్తుంటాయి.

తగ్గిన పర్యాటకుల సంఖ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక శాఖ ఈ కేంద్రాన్ని తనకు స్వాధీనం చేయాలని కూడా కోరింది. అయితే అందుకు అటవీ శాఖ ససేమిరా అంది. రకరకాల రంగురంగుల పక్షులను చూసేందుకు నిత్యం వందల సంఖ్యలో పర్యాటకులు పక్షుల కేంద్రానికి వస్తుంటారు. సాయంత్రం వరకు ఆస్వాదించి వెళ్తుంటారు. ఇప్పుడు ఆ పరిస్థితి భూతద్దం పెట్టి వెతికినా కనిపించడం లేదు. కేవలం ఆదివారం మాత్రమే అడపాదడపాగా పర్యాటకులు వస్తున్నారు. పర్యాటకులు ఆస్వాదించేందుకు తగిన సదుపాయాలు లేకపోవడం, చెరువు అంతా గుర్రపు డెక్క పెరిగి పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో ఒకసారి ఇక్కడికి వచ్చిన వాళ్లు మళ్లీ రావాలని కోరుకోవడం లేదు. దీంతో ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనంగా మారిపోతోంది. వాచ్‌మెన్‌కు పది నెలలుగా జీతం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఒక అవగాహనకు రావొచ్చు. కాగా జిల్లా యంత్రాంగం దీనిని కన్జర్వ్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు చర్యలు చేపట్టింది. అంతమాత్రాన ఈ కేంద్రానికి ఎలాంటి ఉపయోగం ఉండదు. దీనికి ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్వహణ సక్రమంగా చేస్తేనే పూర్వవైభవం వస్తుంది. లేకుంటే రాబోయే రోజుల్లో ఇదొక పాడుబడిన చెరువులా మారిపోయే ప్రమాదం పొంచి ఉంది.

ఎంపీలు, ఎమ్మెల్యేలు నిధులు కేటాయించాలి

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ప్రధానంగా గుంటూరు, విజయవాడ, మంగళగిరి-తాడేపల్లి నగరాల నుంచి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకు ఏటా వచ్చే నిధుల్లో కొంత పక్షుల కేంద్రానికి కేటాయించి అభివృద్ధి పనులు చేపడితే.. పూర్వవైభవం తీసుకురావొచ్చు. ప్రస్తుతం వేసవికాలం కానున్న దృష్ట్యా సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ అయినా కేటాయించి గుర్రపు డెక్కని పూర్తిగా తొలగిస్తే వర్షాకాలంలో చెరువుని పూర్తిస్థాయిలో మంచినీటితో నింపొచ్చు. దాంతో పక్షులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది.

గుంటూరు చానల్‌కు మరమ్మతులు జరిపించాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి


గుంటూరు చానల్‌ను పరిశీలిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

మంగళగిరి సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాలకు సాగునీరందించే గుంటూరు చానల్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు జరిపించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ, రైతు సంఘం నేతలు శుక్రవారం చినకాకానిలోని గుంటూరు చానల్ వంతెన, కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ 30 గ్రామాల ప్రజలకు తాగునీరు, 30 వేల ఎకరాలకు సాగునీరు ఈ చానల్ ద్వారా అందుతుందని చెప్పారు. ఇంతటి ప్రాధాన్యతగల ఈ కాలువ మరమ్మతులకు నోచుకోక నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. చానల్ అభివృద్ధికి గతంలో రూ.120కోట్లు మంజూరు చేసి రూ.60లక్షల పనులు కూడా జరిపించలేదని విమర్శించారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు చానల్ గోడలు పడిపోయి చాలాచోట్ల కాలువ కట్టలు కోతకు గురై ప్రమాదభరితంగా మారాయన్నారు. కాలువలో గుర్రపుడెక్క, తూటికాడ పేరుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధంగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, జనసేన నేత సుంకర సాంబశివరావు, రైతు సంఘం నేతలు పచ్చల శివాజీ, జూజ్రు శంకరరావు, పొన్నెకంటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 847 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000 గరిష్ఠధర రూ.11,025 మోడల్‌ధర రూ.11,025 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,600, గరిష్ఠధర రూ.11,150 మోడల్‌ధర రూ.11,150 పలికాయి.

ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా జూన్ 2న జరగనున్న ధర్నాకు సంబంధించి గోడపత్రికలను శుక్రవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. జూన్ 2న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు తుడిమిల్ల వెంకటయ్య, గుంటక సాంబిరెడ్డి, షేక్ బాషా, బుర్రముక్కు శ్రీనివాసరెడ్డి, సీతారామయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడేపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని పురం సెంటర్, బోసుబొమ్మ సెంటర్, సాంబిరెడ్డి హోటల్, మున్సిపల్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కొరకు విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం 9 గంటల నుండి 1వరకు అంతరాయం ఉంటుందని డీఈఈ సురేష్‌బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో వధూవరులు పినపాటి రాజేశ్, మౌనికలకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను శుక్రవారం టీడీపీ నాయకులు అందించారు. నూతన వస్త్రాలను ఎంపీపీ జబీన్, సర్పంచ్ మాణిక్యం, ఎంపీటీసీ రోజమరియమ్మ, తోటకూర సీతారామయ్య, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్ష, పి.రవియాదవ్, శేషగిరి, ఆశీర్వాదం చేతుల మీదుగా అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఈడీ పదవీ విరమణ

తాడేపల్లి (కుంచనపల్లి), మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలో సుదీర్ఘకాలంపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ సి నాగరాజు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వీడ్కోలు సమావేశంలో సంస్థ ఎండీ రోనంకి కూర్మనాథ్, నాగరాజును సత్కరించారు. కోవిడ్-19, గోదావరి 2022 వరదలు, విజయవాడ 2024 వరదలు, ఎన్నో తుపానుల సమయంలో ఆయన విధులను సమర్థవంతంగా నిర్వహించారు. ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు.

ముగిసిన వేసవి యోగ శిక్షణ శిబిరం

మంగళగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ వేసవి ప్రత్యేక యోగ శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. శ్రీ వేంకటేశ్వర యోగి గురూజీ యోగ సాధకులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రాఘవయ్య, మాధవి, యోగ సేవా కేంద్రం ఉపప్రధాన యోగాచార్యులు మండ్రు శ్రీనివాసరావు, యామిని, నెమలిపురి రంగలత, మొక్కపాటి లక్ష్మీనారాయణ, జవ్వాది శ్రీనివాసరావు, రాజేశ్వరీ, దుర్గారావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ రద్దు చేశాం

● తహసీల్దారు ప్రసాదరావు

పిరంగిపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి మండలంలోని ఎండీయూ వాహనాలను పూర్తిగా రద్దు చేసినట్లు తహసీల్దార్ జే ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. జూన్ 1 నుంచి చౌక ధరల దుకాణాల్లోనే రేషన్ సరుకుల పొందవచ్చన్నారు. 65 ఏళ్ల పై బడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు వారి ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇస్తారని తెలిపారు. మండలంలోని 42 చౌక ధరల రేషన్ డీలర్ల పరిధిలో ఉన్న కార్డు దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల వేతనాల పెంపుపై పరిశీలన

● సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్


గ్రీవెన్స్ డేలో రైతుల సమస్యలు వింటున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు మే 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపును పరిశీలిస్తున్నామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ.సాయి సూర్యప్రవీణ్‌చంద్ తెలిపారు. పారిశుధ్య కార్మికులు, గ్రామ కంఠాల సమస్యలపై పలువురు శుక్రవారం జరిగిన గ్రీవెన్స్ డేలో వినతిపత్రాలు అందజేశారు. పారిశుధ్య కార్మికుల వేతనం రూ.15 వేలకు పెంచి వారికి రాజధాని అమరావతి పింఛన్ అమలు చేయాలని సీఐటీయు నేతలు కోరారు. తుళ్లూరులో రోడ్డు కింద నివాసాలు కోల్పోతున్న వారి సమస్యకు పరిష్కారం చూపుతామని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించటంలో ఆలసత్వం వద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జీ.రవీందర్, శ్రీనివాస్‌నాయక్, భాగ్యరేఖ, పద్మావతి, శేషరెడ్డి, చిన్నికృష్ణ, స్వర్ణమేరి, బీమారావు, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే) జీ.పాండురంగారావు, రామకృష్ణన్ పాల్గొన్నారు.

వచ్చామా.. వెళ్లామా..

● తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

● సగానికి పైగా అధికారులు గైర్హాజరు.. ప్రజాప్రతినిధుల హాజరూ అంతంతే


సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

పెదనందిపాడు, మే, 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తమలపాకుల హెప్సీబా అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి నిర్లక్ష్య గ్రహణం పట్టింది. సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాల్సిన మండల అధికారులు సగం మందికి పైగా అధికారులు డుమ్మా కొట్టారు. ఆ వచ్చిన అధికారులు కూడా వచ్చామా.. టీలు తాగామా వెళ్లిపోయామా అన్న చందంగా వ్యవహరించారు. ప్రజాప్రతినిధులు కూడా మొక్కుబడిగానే హాజరయ్యారు. పది రోజులుగా గ్రామాల్లో విద్యుత్ సమస్యతో ప్రజలు అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని కొందరు ఎంపీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

పాతమల్లాయపాలెం ఎఫ్ఏపై విచారణ


పాతమల్లాయపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ నిర్వహిస్తున్న డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి హనుమంతురావు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతమల్లాయపాలెం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నల్లపు రాజేష్‌పై డ్వామా విజిలెన్స్ అధికారి పీ హనుమంతురావు విచారణ నిర్వహించారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలోని ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడినట్టు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సచివాలయంలో విచారణ నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఇప్పటికే తొలగించామన్నారు. మస్టర్‌లలో తేడాలు, ఇంకా అనేక విషయాలపై విచారణ పరిపారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో ఏడుకొండలు, టీఏ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకాకుమాను శివారులో కూలిన వంతెన


కూలిపోయిన వంతెన

కాకుమాను, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పాపురం శివారు గ్రామమైన చిన్న కాకుమాను నుంచి పొన్నూరు వెళ్లే ప్రధాన రహదారిపై వంతెన ఇటీవల కూలిపోయింది. పూండ్ల కాలువ దాటిన తరువాత ఉన్న వంతెన శ్లాబ్ కుంగి పోవడంతో పక్కనే పంట కాలువపై మట్టిని చదును చేసి రహదారి ఏర్పాటు చేశారు. ఇటీవల కురిస్తున్న వర్షాలకు వంతెన పక్కన ఏర్పాటు చేసిన రహదారిని తొలగించారు. అప్పటి నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు వంతెన పైనే రాకపోకలు సాగిస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న వంతనె ఇటీవల కుంగిపోయి కూలిపోయింది. ఆ సమయంలో వంతెనపై ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. వంతెన కూలిపోవడంతో చిన్న కాకుమాను ప్రజలు పెదపాలెం, పొన్నూరు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు నుంచి ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించడానికి అవకాశం ఉంది. 108 వాహనం, ఆటోలు కానీ ప్రయాణాలు సాగించాలంటే కష్టంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

మంగళగిరి సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఆటోనగర్ వద్ద గల కళా బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం సాయంత్రం పూటుగా మద్యం సేవించిన యువకులు బీభత్సం సృష్టించారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన ఏడెనిమిది మంది యువకులు కళా బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి మద్యం తాగుతున్నారు. మద్యం మత్తు తలకెక్కడంతో వారిలో వారే పలుమార్లు గొడవ పడ్డారు. సాయంత్రం మంగళగిరి పట్టణం పార్కు రోడ్డుకు చెందిన సంపత్ అనే వ్యక్తి బార్‌కు రాగా అతడితో గొడవపెట్టుకున్నారు. పైగా అతడిపై సదరు యువకులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. గమనించిన బార్ సిబ్బంది ఆ యువకులను నియంత్రించలేక సంపత్‌ను ఓ గదిలో ఉంచి కాపాడే ప్రయత్నం చేశారు. దీంతో ఆ యువకులు బార్ సిబ్బందిపై కూడా దాడికి పాల్పడి అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పోలీసులు రావడంతో యువకులు పరారయ్యారు.

ముగిసిన మాజీ ఎంపీ నందిగం పోలీస్ కస్టడీ

తుళ్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ఉద్దండ్రాయునిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజును చితకబాదిన కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు కోర్టు అనుమతితో మూడు రోజులు పోలీసు కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారంతో కస్టడీ ముగిసింది. శనివారం తిరిగి గుంటూరు జిల్లా జైలుకు నందిగంను హాజరు పరచనున్నారు. గతంలో ఆయన మీద హత్య, హత్యాయత్నం కొట్లాటలు, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి తదితర 12కేసులు నమోదయ్యాయి. ఇటీవల కండిషన్ బెయిల్‌పై నందిగం బయటకు వచ్చారు. రాజును సురేశ్ అతని భార్య బేబీలత అనుచరులు 8మంది చితకబాదటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు తుళ్లూరులో కేసు నమోదు అయ్యింది. ఆ కేసుకు సంబంధించి మరింత విచారణ చేయాలని తళ్లూరు పోలీసులు కస్టడీకి తీసుకున్నారు.

సీతానగరం రైల్వేట్రాక్ అండర్ పాస్ వద్ద ప్రమాదం


రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద డివైడర్‌ను ఢీకొన్న లారీ

తాడేపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలను నిషేధించేందుకు సీతానగరం అండర్ పాస్ వద్ద రైల్వేట్రాక్ రక్షణకు రైల్వే అధికారులు గడ్డర్లు ఏర్పాటుచేశారు. ఈ గడ్డర్‌ను శుక్రవారం తెల్లవారుజామున ఓ లారీ ఢీకొంది. తరచూ ఇక్కడ గడ్డర్‌ను భారీ వాహనాలు నిత్యం ఢీకొనడం పరిపాటి అయిపోంది. ఈ సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠకు శంకుస్థాపన


శంకుస్థాపన నాభిశిలకు అభిషేకాలు చేస్తున్న వేద పండితులు

వట్టిచెరుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు, చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెం గ్రామాల మధ్య అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. వేద పండితులు బదరీనాథ్, డాక్టర్ రమణకుమార్‌లు పూజా క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో స్థల దాతలు బొమ్మినేని సాంబశివరావు కుమార్తె వట్టికూటి శిరీషారాణి, వంశీకృష్ణ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమానాయక్

ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వట్టిచెరుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సీఐ రమానాయక్ తెలిపారు. పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఐ ప్రసంగించారు. సైబర్ నేరాలకు ఆర్థిక నేరగాళ్ళు ఎలా పాల్పడుతున్నారు.. ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో ఆయన విద్యార్థులకు వివరించారు.

పొగాకు రైతుల ధర్నాను జయప్రదం చేయండి


రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

పెదనందిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ 2న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నాగులపాడు, పెదనందిపాడు గ్రామాల్లో పొగాకు రైతులను కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. జిల్లాలో 86వేల ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు సాగు చేశారని, దీనిని కొనేనాథుడు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రైతు సంఘ నాయకులతో కంపెనీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావుచ కన్నెగంటి చంద్రరావు, లతీఫ్, నల్లమోతు రాజేంద్ర, గేరా ఏసోబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

పిరంగిపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పిరంగిపురం గ్రామంలో సత్తెనపల్లి మార్గంలోని రైల్వే గేటును నాలుగు రోజుల పాటు మూసి వేస్తున్నట్లు గుంటూరు డివిజనల్ సీనియర్ సెక్షన్ ఇంజనీరు పీ ఉమామహేశ్వరావు శుక్రవారం తెలిపారు. ఎల్‌సీ 298 నెంబరు గల రైల్వే గేటును శనివారం నుంచి జూన్ 3వ తేదీ వరకు అత్యవసర ఇంజనీరింగ్ పనుల నిమిత్తం మూసి వేస్తున్నామన్నారు. వాహన దారులు ఆరోగ్యనగర్ వైపు ఉన్న అండర్ బ్రిడ్జిని ఉపయోగించుకుని సహకరించాలని కోరారు

చెరువులను నింపాలి

పెదనందిపాడు, మే, 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి తాగునీటి చెరువలను త్వరితగతిన నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ తెలిపారు. వరగాని కొల్లా వారి చెరువుకు వస్తున్న నీటిని శుక్రవారం ఆయన పరిశీలించారు, కాల్వ ద్వారా నాలుగు రోజుల పాటు తాగునీటి విడుదల జరుగుతుందన్నారు. ఇప్పటికే 15శాతం నీరు చేరిందని, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు చెరువులు నింపాలని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ మృతి

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ జాగర్లమూడి రామకృష్ణ(71) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో మరణించారు. ప్రత్తిపాడుకు చెందిన రామకృష్ణ తొలి నుంచి జర్నలిజంలోనే ఉన్నారు. హైదరాబాదు, మద్రాసులలో తెలుగు, ఇంగ్లీషు జాతీయ పత్రికలతో పాటు సినీ రంగ విభాగంలో కూడా ఆయన పనిచేసి అందరి మన్ననలు పొందారు. రామకృష్ణ అంత్యక్రియలు శనివారం హైదరాబాదులోని ఈఎస్ఐ శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎన్ఆర్ఐ అధ్యాపకురాలికి డాక్టరేట్

మేడికొండూరు మే 30 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు వలేటి నాగజ్యోతికి డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ తెలిపారు. 'డిజైన్ అండ్ న్యూమరికల్ ఎనాలసిస్ ఆఫ్ పెరోవ్స్కైట్ సోలార్ సెల్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అకడమిక్ డైరెక్టర్ కోటా శ్రీనివాసరావు, ఈడీ తిలక్‌బాబు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్ తదితరులు నాగజ్యోతిని అభినందించారు.


నాగజ్యోతిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు

శ్త్రీ నిధిపై విచారణ.. తేలని అక్రమాలు

● ఫిర్యాదు చేసిన సంఘానికి సగం న్యాయం

● మిగిలిన వారు నోరెత్తకుండా యానిమేటర్ల అల్టిమేటం

మేడికొండూరు మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్త్రీ నిధి రుణాల అక్రమాలపై అధికారులు చేపట్టిన విచారణ మమ అనిపించారు. కేవలం ఫిర్యాదు చేసిన సంఘానికి సగం న్యాయం చేసి మిగతా సంఘాల వారిని వదిలేశారు. తమకు కూడా అన్యాయం జరిగిందని విచారణ సమయంలో చెబుదామని మిగతా సంఘాల సభ్యులు ప్రయత్నించినా నోరెత్తకుండా యానిమేటర్లు అల్టిమేటం జారీ చేశారు. దీంతో అన్యాయానికి గురైన డ్వాక్రా సంఘాల సభ్యులు తమ ఆవేదన ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాక ఆవేదన చెందుతున్నారు. మండలంలో రెండు నెలల క్రితం శ్రీనిధి రుణాల తిరిగి చెల్లింపు వ్యవహారంలో కొందరు చేతివాటం ప్రదర్శించారు. తాము చెల్లించాల్సిన మొత్తానికన్నా ఎక్కువ మొత్తం చెల్లించామని మేడికొండూరుకు చెందిన కార్తికేయ మహిళా గ్రూపు ప్రజావేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే సాధారణ ఉద్యోగితో విచారణ జరిపించిన అధికారులు కేవలం ఫిర్యాదు చేసిన సంఘానికి మాత్రమే అధికంగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని నోటి మాట ద్వారా స్థానిక శ్రీనిధి సిబ్బందిని ఆదేశించారు. అప్పటికి చెల్లిస్తామని అంగీకరించిన సిబ్బంది అందులో సగం మాత్రమే చెల్లించి సరిపెట్టారు. ఫిర్యాదు చేసిన సంఘంపై శ్రీనిధి సిబ్బందితో పాటు కొందరు యానిమేటర్లు కన్నెర్ర చేయడంతో వారికి రుణాల మంజూరు, ఇతర వ్యవహారాల్లో దూరంగా పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మిగతా సంఘాల్లోని సభ్యులు తమకు అన్యాయం జరిగినా నోరెత్తడం లేదు. ఇప్పటికే ఖర్చుల పేరుతో రుణాలు మంజూరు చేసినప్పుడల్లా 3 వేల నుంచి 5 వేల వరకు వసూలు చేస్తున్నా భరిస్తున్నామంటున్నారు. తాము ప్రతి నెల సక్రమంగా చెల్లించాం ఇంకా ఎందుకు చెల్లించాలని ఎవరైనా ప్రశ్నిస్తే కంప్యూటర్లో మీరు బకాయి ఉన్నట్టు చూపుతుందంటున్నారని కొందరు తెలిపారు. డ్వాక్రా సంఘాల సభ్యులలో ఎక్కువ శాతం మంది మహిళలు నిరక్షరాశ్యులు కావడం వల్ల తమకు జరిగిన నష్టంపై అవగాహనకు రాలేకపోతున్నారు.

చెరువులు నింపుతున్నాం...

పిరంగిపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాగు నీటి చెరువులను మూడు రోజులుగా నాగార్జున సాగర్ నీటితో నింపుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం పిరంగిపురంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిరంగిపురంలో 12 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న చెరువును గుంటూరు బ్రాంచ్, కొండవీటి మేజరు కాల్వల ద్వారా వచ్చే నీటితో నింపుతున్నామన్నారు. కండ్రిక, మేరికపూడి, గుండాలపాడు గ్రామాల తాగునీటి చెరువులను కూడా నింపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ నాగ శ్రీనివాస్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శాయిబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహానాడు విజయం వైసీపీ సమాధికి సంకేతం

కాకుమాను, మే 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడు విజయవంతం కావడమే వైసీపీ రాజకీయ సమాధికి సంకేతమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మండల నూతన అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడును ఒక పెద్ద డ్రామాగా జగన్ అభివర్ణించడం సిగ్గుచేటన్నారు.

ఐక్యతే ఆయుధంగా ముందుకు సాగుదాం

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య


ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య

తాడేపల్లి టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): ఐక్యతే ఆయుధంగా ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు ముందుకుసాగాలని అందుకు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు అన్ని మద్దతుగా నిలుస్తాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వీ కృష్ణయ్య చెప్పారు. సిమెంటు ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్‌కు గురై శుక్రవారానికి 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్మిక కుటుంబాలు పెద్దఎత్తున దీక్షా శిబిరం వద్దకు వచ్చి శిబిరంలో పాల్గొన్నారు. తొలుత యూనియన్ నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా దీక్షలను సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యుడు కృష్ణయ్య ప్రారంభించారు. యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణయ్య మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర నేత ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ కార్మికులు పోరాటానికి పూర్తి అండదండలిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు జొన్నా శివశంకర్, ఆంద్ర మాల్యాద్రి, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్‌టీయూ నేత ఆర్ శ్రీనివాసరాజు, ఏఐటీయూసీ నేత కంచర్ల కాశయ్య, స్థానికులు సూర్యప్రకాష్, సాంబశివరావు, సుభాని, అంకయ్య తదితరులు పాల్గొన్నారు. 179వ రోజు దీక్షల్లో రమాదేవి, ఇమాంబి, మరియమ్మ, శివకుమారి, శారమ్మ, దుర్గాభవాని కూర్చున్నారు.

కేఎల్‌యూలో వెబైల్ యాప్స్ సెంటర్ ప్రారంభం


వేదికపై శ్రీకాంత్ నాదెళ్ళ, వీసీ సారథివర్మ తదితరులు

తాడేపల్లి(వడ్డేశ్వరం), మే 30(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కెఫిన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ వెబైల్ యాప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ డిజిటల్ అండ్ ఏఐ ఎక్సలెన్స్ (సీవోడీఈ)ను శక్రవారం ప్రారంభించారు. ఈ భాగసామ్యంతో విద్యార్థులకు ఏఐ, డిజిటల్ టెక్నాలజీపై ప్రత్యక్ష పరిశ్రమ అనుభవం లభించనుంది. కెఫిన్ టెక్నాలజీ గ్రూప్ సీఈవో శ్రీకాంత్ నాదెళ్ళ సెంటర్‌ను ప్రారంభించి ప్రసంగిస్తూ విద్యార్థులకు పరిశ్రమ రహిత శిక్షణ ఇవ్వడం ద్వారా సంస్థ వాటాదారులకు దీర్ఘకాలిక విలువను అందించగల మోడల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కెఫిన్ టెక్నాలజీ గురించి వివరిస్తూ దేశంలో అతి పెద్ద ఇన్వస్టర్, జారీదారుల సర్వీసు ప్రొవైడర్‌గా మ్యూచ్యువల్ ఫండ్స్, పెన్షన్, కార్పొరేట్ బాండ్స్ వంటి డొమైన్లలో పూర్తి సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వెబైల్ యాప్స్ సీఈవో నజీష్మీర్, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ ఎంవీ నాయర్, ఎండీ, సీఈవో శ్రీకాంత్ నాదెళ్ల, జనరల్ అట్లాంటిక్ ఆపరేటింగ్ పార్ట్‌నర్ శ్రీనివాస్ పెద్దాడ, కేఎల్‌యూ వీసీ డాక్టర్ సారథివర్మ, ప్రోవీసీ డాక్టర్ రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుమన్, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీఈవో వెంకటగిరి వంకాయల, చీఫ్ పీపుల్ ఆఫీసర్ సుజయ్ పుత్రాన్, వెబైల్ యాప్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భరత్ వైఎస్‌వీ తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యానకేంద్రంలో యోగా పోటీలు

తాడేపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎంటీఎంసీ ఆధ్వర్యంలో మానస సరోవరం పిరమిడ్ ధ్యానకేంద్రంలో యోగా పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకమైన యోగాసనాలు ప్రదర్శించిన వారికి ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల బహుమతులు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉండవల్లి 2 సచివాలయం తరపున వివిధ ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, యోగా మాస్టర్ బండారు నరసింహారావును రచయిత, దర్శకుడు గాదె నాగభూషణంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌వో మురళి, .కళ్లం రామిరెడ్డి, యోగా గురువులు ఆత్మకూరు కొండయ్య, బండారు నరసింహారావు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

జూదరులకు జరిమానా

తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జూదరులకు న్యాయస్థానం జరిమానా విధించినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. మండలంలోని నందివెలుగు, కొలకలూరు, అంగలకుదురు వంటి గ్రామాల్లో ఈ నెలలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్లతో పేకాట ఆడుతున్న స్థావరాలను గుర్తించి మొత్తం 13మందిని అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట హాజరుపరచగా న్యాయస్థానం వారికి రూ.3900 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం సహించేది లేదు

● వర్షాకాలం వస్తోంది... డ్రెయిన్లను శుభ్రం చేయండి: మంత్రి మనోహర్
● జంపని కాలువ వద్ద పనులు పరిశీలించిన మంత్రి


జంపని డ్రెయిన్ల పూడికతీత పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అలసత్వం సహించేది లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని గురవయ్య కాలనీ మీదుగా ప్రవహిస్తున్న జంపని కాలువను చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, సబ్‌కలెక్టర్ సంజనసింహ, కమిషనర్ బండి శేషన్నతో కలిసి మంత్రి మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహర్ అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పట్టణంలోని అన్ని డ్రెయిన్లలో పూడికలు తీసి వ్యర్థాలను తొలగించి మురుగునీరు పారుదలలో ఆటంకాలు ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని డ్రెయిన్ల నిర్వహణ చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తూ ఉండేవన్నారు. అపరిశుభ్రమైన నీటిలో ప్రజలు రాకపోకలు చేసేందుకు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. రోజుల తరబడి నీరు నిలిచి దోమలు, దుర్గంధంతో స్థానిక ప్రజల అగచాట్లు అన్నీ ఇన్నీ కావన్నారు. అధికారులు వీటన్నింటిని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. డ్రెయిన్ల నిర్వహణలో ఎక్కడా కూడా రాజీపడవద్దన్నారు. సకాలంలో పూడికతీత పనులు చేపట్టి వచ్చిన వ్యర్థాలను రోడ్లపై నుంచి డంపింగ్ ప్రాంతానికి తరలించాలన్నారు. ఇప్పటికే ప్రారంభమైన పూడికతీత పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. పలువురు అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘం సాధారణ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 11.30కు కౌన్సిల్ హాలులో నిర్వహించే సమావేశానికి సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు, ఇతర సభ్యులు హాజరు కావాలని కోరారు.

8న శివాజీ స్మారక బైక్ ర్యాలీ

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో జూన్ 8న బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు డీఎల్ కాంతారావు చెప్పారు. ర్యాలీ కరపత్రాలను, పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేసేందుకు శివాజీ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేసేలా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొనాలని కోరారు. దేశంలో లౌకిక విధానం అమలులో ఉండటంతో కొన్ని స్వార్థపర శక్తులు ఇతర దేశాల మోజులో ఉంటూ భారత దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవాలన్నారు. మైలా హరికృష్ణ, హనుమంతరావు, మారుతీరామ్, హనుమత్ ప్రసాద్, వాసుదేవనాయుడు, రమాదేవి, శ్రీనివాస్, పూర్ణ, నాగార్జున పాల్గొన్నారు.


మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

రోడ్డు ప్రమాద మృతులకు మంత్రి నివాళి

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళల భౌతికకాయాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సందర్శించి నివాళులర్పించారు. నందులపేటకు చెందిన కన్నెగంటి సరస్వతి, ఝాన్సీ, సూర్యకుమారి కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలం వెళుతూ మేదరమెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సంఘటన వివరాలు తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు మంత్రి ధైర్యం చెప్పారు.

ఘనంగా ప్రపంచ మెనోపాజ్ హైజీన్ దినోత్సవం


శానిటరీ ప్యాడ్‌లను అందజేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన హోప్ విన్ హాస్పిటల్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో నంబూరులోని జేఎంజే హైస్కూల్ ప్రాంగణంలోని ఉజ్వల హోంలో శుక్రవారం ప్రపంచ మెనోపాజ్ హైజీన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హోప్‌విన్ హాస్పిటల్ చైర్‌పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమసుల్తానా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రుతుక్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలతో పాటు రుతుక్రమం ఆగిపోయిన తర్వాత వచ్చే ఆరోగ్య సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ఆమె వివరించారు. రుతుక్రమం సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతను, తీసుకోవాల్సిన ఆహారం వంటి విషయాలను ఆమె వివరించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా మహిళలకు శానిటరీ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ రోజ్‌లీన, వార్డెన్ మల్లేశ్వరి, ప్రశాంతి, ఆసుపత్రి మేనేజర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిది

● సీపీఎం కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, సమైక్యతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిపిఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ చెప్పారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, కాశ్మీర్‌లో దాడి చేసిన ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం అంతమొందించాలన్నారు. దేశంలో పౌరులకు రక్షణ కల్పించాలని, సమర్థులైన మిలటరీ అధికారులపై మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, రవికుమార్, వెంకటసుబ్బయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిబార్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ శిబిరం

● ప్రారంభించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ


సిబార్‌లో వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

పెదకాకాని, మే 30 (ఆంధ్రజ్యోతి): తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల ఏర్పాటుచేసిన గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్ శిబిరాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సిబార్‌ను అభినందించారు. మహిళలందరూ గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ సంస్థలు కూడా ఇటువంటి సామాజికసేవ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో వందమంది మహిళలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేశారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఖరీదైన ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించి డాక్టర్ రేవతికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత డాక్టర్ నవీన గర్భాశయ క్యాన్సర్ కారకాలు, నివారణలో వ్యాక్సిన్ పాత్రను వివరించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఒరిస్సా యువకుడి ఆత్మహత్య

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మే 30 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని స్పిన్నింగ్ మిల్లులో ఒరిస్సాకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ వెంకట కృష్ణ కథనం ప్రకారం చేబ్రోలులోని ఎన్ఆర్‌కే స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్న రవికుమార్(45) క్వార్టర్స్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే రవికుమార్ పేరు మాత్రమే తెలిసినప్పటికి ఇతర వివరాలు లభ్యం కాలేదు. రవికుమార్ ఒరిస్సాకు చెందిన వ్యక్తిగా మాత్రమే గుర్తించారు. మృతికి సరైన కారణాలను కూడా తెలియకపోవడంతో అనేక కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. రవికుమార్ ఆత్మహత్య చేసుకున్న క్వార్టర్‌లో మహిళకు సంబంధించిన దుస్తులు ఉండడంతో రవికుమార్ ఆత్మహత్యకు పాల్పడడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి రవికుమార్ మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మండల పరిధిలోని వడ్లమూడిలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట కృష్ణ తెలిపారు. వడ్లమూడి గ్రామ శివారులో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2100 నగదు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

'నంది అవార్డుల విధానం ప్రకటించాలి'

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): సినీ కళాకారులకు ఇచ్చే నంది అవార్డుల విధి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఏపీ మా వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్‌రాజా కోరారు. శుక్రవారం తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో కూడా గత పదేళ్ల నుంచి నంది అవార్డులు ఇవ్వడం లేదని, వెంటనే జ్యూరీని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సినీ రంగంలో విశిష్ట సేవలు అందించిన వారి పేరుతో ప్రత్యేక అవార్డును కూడా అందించాలన్నారు.

పోలీసులు చట్టాన్ని మీరితే ఎలా?

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు చట్టాన్ని అతిక్రమించి రౌడీషీటర్లపై వ్యవహరించిన తీరు సరికాదని గాంధీ దేశం ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజన్ చెప్పారు. రౌడీషీటర్లపై పోలీసులు తీరును విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

సీఐలను విధుల నుంచి తొలగించాలి

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లను కొట్టిన కేసులో సిఐలను విధుల నుంచి తొలగించాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి అందె శ్యామ్ డిమాండ్ చేశారు. ఐతానగర్‌లోని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఖుద్దుస్, హరిప్రసాద్, మహేష్ తదితరులు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే గ్రీవెన్స్

తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం చేసేందుకే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మహమ్మద్ ఖుద్దుస్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు, నివేసన స్థలాలు వంటి పలు సమస్యలతో అర్జీలు వచ్చినట్లు హరిప్రసాద్ పేర్కొన్నారు. మల్లవరపు విజయ్‌కుమార్, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ చర్చి వద్ద ఉద్రిక్తత

పొన్నూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పాత పొన్నూరు ఏఈఎల్‌సీ చర్చి వద్ద శుక్రవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఏఈఎల్‌సీ చర్చి ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే హై కోర్టు కమిషన్‌ను నియమించింది. అయితే కమిషన్‌కు సంబంధం లేకుండా శుక్రవారం పాత పొన్నూరులోని ఏఈఎల్‌సీ చర్చిలో ఒక వ్యక్తి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నాడని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తూ నిరసనకు దిగింది. ఈ సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ వీరానాయక్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పి పంపించి వేశారు. చర్చిలో సమావేశం నిర్వహిస్తున్న నిర్వాహకులు తాము ఆదరణ కూడిక చేస్తున్నామని ఎన్నిక కాదని సమాధానం ఇవ్వడంతో ఇరువర్గాలను శాంతింపచేశారు.

ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి కల్యాణోత్సవం

తెనాలి అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీసీతారామచంద్రస్వామి వారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితులు నాగమారుతీ బృందం కల్యాణాన్ని శోభాయమానంగా జరిపించారు. 115మంది భక్తులు 108 పర్యాయాలు చాలీసా చేశారు. జి.బాలకృష్ణ, రాధాకృష్ణమూర్తి, గోపాలరావు కల్యాణం జరిపించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, కిరణ్‌కుమార్, సురేష్, త్రిమూర్తి, అనురాధ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

పొన్నూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు అనే సమాజ సేవా కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్న శ్రీ రామా మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబును ఆర్కే ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. శ్రీ రామా మున్సిపల్ పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి లాజర్‌బాబు కృషి చేశారు. అలాగే ఇటీవల విజయవాడలో వచ్చిన ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన వారిని ఆదుకోవడం ఉచిత ఆహారం పంపిణీ, మందులు పంపిణీ, టీబీ పేషెంట్‌లకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం వంటి కార్యక్రమాలలో కాకుమాను లాజర్ బాబు భాగస్వామ్యులయ్యారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలి

● ఎంఈవో ఝాన్సీలత

కొల్లిపర, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని ఎంఈవో ఝాన్సీలత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం విద్యాశాఖాధికారులు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలను చేర్పడం వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పిడపర్తి రమేష్‌బాబు, వి.మురళి, అలేఖ్య, స్వరూపరాణి, రాంబాబు, సురేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎంపీడీవో

కొల్లిపర, మే 30 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలపై మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఆమె సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గృహ నిర్మాణాలపై ప్రతిఒక్క లబ్ధిదారునికి అవగాహన కలిగించాలన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా తమవంతు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కాలనీల్లో అనేక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగించు కోవాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాభ్యాసంతో మానసిక ప్రశాంతత: కమిషనర్

పొన్నూరు టౌన్. మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాభ్యాసం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక లయన్స్ పాలీ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన యోగా శిక్షణ శిబిరంలో పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా యోగాభ్యాసాలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నేటి పరిస్థితులలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ రోజు యోగాభ్యసనం వల్ల మానసిక ప్రశాంతతో పాటు శారీరక ధృఢత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు యోగాభ్యాసనాలు చేశారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పొన్నూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తెనాలిలో పోలీసులు ఒక న్యాయవాదితో పాటు దళిత, ముస్లిం యువకులతో వ్యవహరించిన అమానుష చర్యలను నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్ తెలిపారు. పోలీసులు చట్ట పరిధి దాటి వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తప్పు చేసిన వారిని న్యాయస్థానాల ముందు నిలబెట్టి శిక్షించాలని సొంత శిక్షలు అమలు చేయడం సబబు కాదన్నారు.

హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు వెన్నుపోటు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

తెనాలి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జగన్ కన్నా ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తానని అనేక పథకాలను ఎన్నికల ముందు ప్రజలకు చెప్పి ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్నా వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడని జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. శుక్రవారం తెనాలి వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలసి జూన్ నాలుగన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి చేసుకుందన్నారు. ఎన్నికలకు ముందు జగన్ కన్నా గొప్పగా సంక్షేమాన్ని అందిస్తానని 148 వాగ్దానాలను, సూపర్ సిక్స్ అని ఇంటింటికి ప్రచారం చేశారన్నారు. చంద్రబాబు హామీలు ఇస్తే పవన్ కల్యాణ్ వాటిని అమలు చేస్తామని గ్యారెంటీ ఇచ్చారన్నారు. ప్రతి బిడ్డకు అమ్మఒడి, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు పథకాలు ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. దీపం పథకం ద్వారా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు సబ్సిడీ అందించడం లేదన్నారు. జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని 175 జిల్లాల్లో చేపట్టడం జరుగుతుందన్నారు. వైసీపీ శ్రేణులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న నివేశన స్థలాల సాధన ధర్నా

పొన్నూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నివేశన స్థలాల సాధన కోసం జూన్ 2 పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి పుప్పాళ్ల సత్యనారాయణ కోరారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ధర్నా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణంలో 2, గ్రామాలలో 3 సెంట్లు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఆర్థిక సహకారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి అరేటి రామారావు, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, వ్యకాస నియోజకవర్గ కార్యదర్శి షేక్ గౌస్, రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణదారులు సమయపాలన పాటించాలి

పొన్నూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీ చేస్తున్నందున దుకాణదారులు సమయపాలన పాటించాలని తహసీల్దార్ జియావుల్ హక్ శుక్రవారం ఆదేశించారు. పొన్నూరు, పట్టణ, మండల పరిధిలో 35029 రేషన్ కార్డుదారులు ఉన్నారన్నారు. మండలంలో 45, పట్టణంలో 23షాపుల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దుకాణదారులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు షాపులు తప్పనిసరిగా తెరచి ఉంచాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

పొన్నూరులో సత్యా షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న రవీంద్ర, సెంథిల్

పొన్నూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఏపీలలో 300లకు పైగా షోరూంలు వున్న సత్యా ఏజెన్సీస్ తన నూతన షోరూంను పొన్నూరులోని జీబీసీ రోడ్‌లో ఏర్పాటు చేసింది. ఇటీవల ఈ షోరూంను డాక్టర్ రవీంద్ర, సత్యా ఏజెన్సీస్ సేల్స్ ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. అన్ని గృహోపకరణాలపై 70శాతం వరకు రాయితీ కల్పిస్తున్నామని, ప్రతి కొనుగోలుపై బహుమతి అందిస్తున్నామని వివరించారు.

శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొల్లిపర, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో శుక్రవారం శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితుడు కొల్లిపర కుటుంబరావు మాట్లాడుతూ దేవి ఖడ్గ మాల స్తోత్రం చదవడం మనసు ప్రశాంతంగా ఉంటుందని భక్తులకు తెలియజేశారు.